నినాదం
గురువారం, తెలంగాణ
27 ఫిబ్రవరి 2025
www.ninadam.co.in

# పంచాయతీలకు.. నిధుల కటకట..

- పన్నెండు నెలలుగా నిలిచిన నిధులు
- సొంతంగా జేబుల నుంచి రోజువారీ ఖర్చులు పెడుతున్న సెక్రటరీలు
- ప్రతి జీపీలో నెలకు 10వేలకుపైనే ఖర్చు
- నిధులు లేక.. పెట్టిన డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు



**కోదాడ, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** పన్నెండు నెలలుగా గ్రాంట్లు రాకపోవడంతో జీపీలు ఆర్థికంగా చతికిల పడ్డాయి. రోజువారీ పనులకు కూడా పైసా లేక కార్యదర్శులే సొంతంగా జేబుల నుంచి ఖర్చులు పెడుతున్నారు. పెట్టిన పైసలు రాక, ట్రెజరీలకు ఇచ్చిన చెక్కులకు మోక్షం లేక, రోజు వారీ పనులు ఆపలేక అప్పులపాలవుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. ఇంతకాలం చిన్న చిన్న ఖర్చులు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు.. ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. ఫలితంగా గ్రామాల్లో వీధి దీపాలు వెలుగకపోయిన, బోరు పని చేయకపోయిన, ట్రాక్టర్లలో డీజిల్ లేకపోయిన వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకాలం కార్యద ర్శులు సొంతంగా వెచ్చించిన ఖర్చులు తిరిగి రాక పోగా, నగదు చెల్లించకుండా సామగ్రిని ఇచ్చేందుకు షాపుల నిర్వాహకులు నిరాకరిస్తుండడంతో ఎక్కడి పను లు అక్కడే నిలిచి పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

**15వ ఆర్థిక సంఘం నిధులు ఇవ్వని కేంద్రం...**

ప్రతి గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం అభి వృద్ధికోసం నిధులు మంజూరు చేస్తుంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాల్సి ఉం ది. పంచాయతీల్లో పాలక వర్గాలు లేనందున నిధు లు విడుదల చేయలేమంటూ కేంద్రం చేతులెత్తేసిం ది. సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నిక లు నిర్వహించి ఉంటే కేంద్రం నిధులు సక్రమంగా విడుదలై ఉండేవి. పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసి దాదాపు రెండేళ్లు గడుస్తున్న రాష్ట్ర ప్రభు త్వం ఎన్నికలు నిర్వహించడంలో తాత్సారం చేస్తోంది. పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసిన తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం పట్టభద్రులు, టీచర్స్, ఎమ్మెల్సీ ఎన్నికల ప్ర క్రియ జరుగుతుండడంతో పంచాయతీ ఎన్నికల నిర్వ హణ జరుగలేదు. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు ఆటంకం ఏర్పడింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే ఫండ్ రిలీజ్ చేస్తామని కేంద్రం లంకె పెట్టడంతో ఆ నిధులపై ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్సీ) కింద రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫండ్ కూడా రాకపోవడంతో గ్రామాల్లో నిధుల కొరత తీవ్ర రూపం దాల్చింది. కేంద్ర గ్రాంట్ 2024 ఆగస్టు నుంచి నిలిచిపోగా, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 2023 ఆగస్టు నుంచి నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభు త్వం కూడా గ్రామ జనాభాలోని తలా ఒక్కంటికి రూ. 108 చొప్పున విడుదల చేయాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిలో పయనిస్తోంది.

**జనరల్ ఫండ్ విడుదలకూ అడ్డంకి...**

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు నిలిపివేయగా సొంతంగా జమ చేసుకున్న ఫండ్‌ను కూడ వినియోగించుకోలేని ధీనమైన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో వసూలు చేసే ఇంటి పన్నును కార్యదర్శులు ట్రెజరీ కార్యాలయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు. ఆ నిధులను అవ సరమైనప్పుడు కార్యదర్శులు చెక్కులు డిపాజిట్ చేయడం ద్వారా తిరిగి డ్రా చేస్తారు. జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలు ఉండగా, ట్రెజరీలలో పంచాయతీ కార్యదర్శులు జమ చేసిన మొత్తం సుమారు రూ. మూడు నుంచి నాలుగు కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆ నిధులను కార్యదర్శులు డ్రా చేసి గ్రామాల్లో అవసరమైన వాటికి ఉపయోగిస్తారు. ఆరు నెల లుగా అంటే ఆగస్టు 2024 నుంచి జనరల్ ఫండ్ నిధులు కూడా విడుదల కావడం లేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. గ్రామాల్లో వివిధ పనులు చేపట్టేందుకు అవసరమైన డబ్బుల కోసం చెక్కులు డిపాజిట్ చేస్తే పాస్ కావడం లేదని చెబుతున్నారు. ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోగా, మరోవైపు తాము వసూలు చేసి డిపాజిట్ చేసిన సొమ్ము ఫ్రీజ్ కావ డం తో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో గ్రామ అవసరాల నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు సొంతంగా జేబుల్లో నుంచి వెచ్చిస్తున్నారు. మరి కొంత దుకాణా ల్లో ఖాతాలు పెట్టడం ద్వారా నెట్టుకొస్తున్నారు. గ్రామ అవసరాలు తీర్చడం కోసం జిల్లా వ్యాప్తంగా కార్యదర్శులు ఇప్పటికే సుమారు రూ. లక్ష వరకు వెచ్చించినట్లు తెలుస్తోంది. ఇకమీదట సొంతగా చెల్లించే స్తోమత తమకు లేదనే అభిప్రాయంలో ఉన్న కార్యదర్శులు పంచాయతీల నిర్వహణ చేపట్టడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం.

**సెలవులపై వెళుతున్న కార్యదర్శులు..?**

పని ఒత్తిడి తట్టుకోలేక సర్వేలపై సర్వేలు చేయించడంతో చాలామంది కార్యదర్శులు గత కొన్ని నెలలుగా సెలవులపై వెళుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ప్రస్తుతము 90 మంది సెలవు పై వెళ్లినట్లసమాచారం. నల్లగొండ జిల్లాలో 844గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికీ 170 మంది కార్యదర్శులు సెలవు పై వెళ్లినట్లు సమాచారం. మీద యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామపంచాయితీలు ఉన్నాయి.జిల్లాలో కూడా పలువురు కార్యదర్శులు సెలవుపై వెళ్లారు. ఉమ్మడి . నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సామూహికంగా సెలవు పై వెళ్లే పనిలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఇప్పటికీ మరి కొంత మంది సెలవుకోసం దరఖాస్తులు పెట్టుకోగా అధికారులు అనుమతి ఇవ్వనట్లు తెలుస్తుంది. అంతా సెలవులపై వెళ్లితే గ్రామాల్లో పనులు కొనసాగడం కష్టమని ఉద్దేశంతో సెలవులు మంజూరు చేయడం లేదు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకే గ్రామాలకు చేరుకుంటున్న కార్యదర్శులు ఇళ్లకు చేరేసరికి రాత్రి అవుతుంది. ఉదయాన్నే గ్రామాల్లో ఉండి రోజువారి శానిటేషన్ రిపోర్టు ఉన్నత – అధికారులకు పంపాల్సి ఉంటుంది. మురుగు కాలువలు శుభ్రం చేయడం మొదలుకొని ఇళ్లపన్నులు వసూళ్లు, వీధిదీపాల ఏర్పాటు, వైకుంఠధామాలు,ఆ ప్రకృతి వనాల నిర్వహణ, డంపింగ్ యార్డ్ పర్యవేక్షణ, నర్సరీలో మొక్కలపెంపకం ఉపాధి పథక పనులు గ్రామీణ నీటి సరఫరా ఓటర్ల జాబితా,పారిశుధ్య పనులు ప్రగతి తదితరాంశాలకు సంబంధించి వివరాలను ప్రత్యేకయాప్లో పోస్ట్ చేయాల్సి ఉంటుంది.ఆయా ప్రదేశాల్లో ఫోటోలు దిగి యాప్లో పంపాల్సిన బాధ్యత కార్యదర్శులది. ఎన్ని రకాల పనులు కార్యదర్శులపై ఉన్నాయో అర్థమవుతుంది. పనుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ప్రజల నుండి కార్యదర్శులకు ఒత్తిడి వస్తుంది ఇది కూడా కార్యదర్శులకు సమస్యగా మారడంతో సెలవుపై వెళ్లక తప్పడం లేదు. కుటుంబ పోషణకి వేతనాలు సరిపోక ఇబ్బందులు పడుతుంటే గ్రామాల్లో అభివృద్ధి పనలకు ఎలా వెచ్చించాలి అని కార్యదర్శులు మదన పడుతున్నారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.8,500 గ్రామ నేత పంచాయితీల పాలక వర్గాలు చెల్లిస్తారు. సదరు వేతనాలు నెలల తరబడి చెల్లించకపోవడంతో పారిశుధ్య కార్మికులు కూడా పనులు చేసేందుకు ఆసక్తి చూపటం లేదు ప్రభుత్వం నిధులను విడుదల చేస్తేనే పంచాయతీల నిర్వహణ సక్రమంగా జరిగే అవకాశాలున్నాయి. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు జఠిలం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD

O.S. No. 738 of 2025

Between:

1. Pooja Gurbani alias Pooja Gurbani Lalwani, W/o. Sanjay Lalwani,D/o. Late Suresh K Gurbani,Occ: Business, aged about 38 years,R/o. Flat No.203, 2nd Floor, Rockville Apartments,Road No.4, Banjara Hills, Hyderabad - 500034.
2. Mala S Gurbani, D/o. Late Suresh K GurbaniOcc: Business, aged about 35 years,R/o. Plot 55, Flat No.203, Gayatri Residency,Opp. Ghanshyam Super Market, Ishaq Colony, Picket, Secunderabad- 500009.

...Plaintiffs

AND

MRO/TAHSILDAR and Others

...Defendants

To,
All concerned
Having office at Road No.2, Venkateshwara Nagar, Aurora Colony, Banjara Hills, Hyderabad, Telangana - 500034.

...Defendants

Please take notice that the above-said Suit OS. No. 738 of 2025 has been filed before the Hon'ble II Junior Civil Judge, City Civil Court, at Hyderabad for declaration of legal heirs and the Hon'ble Court was pleased to permit issuance of notice through paper publication vide in O.S.No. 738 of 2025. The Hon'ble Court has posted the above-said matter on 24.03.2025 for your appearance in the matter If no appearance is entered by you on 24.03.2025, the matter will be proceeded with in your absence and will be decided on merits.

**(By Order of Hon'ble II Junior Civil Judge, City Civil Court, Hyderabad in O.S. No. 738 of 2025)**

Sd/-
Ashish Samat, Advocate
H. No. 1-8-54/1/1, P.G. Road, Secunderabad.
Ph +91 9700589433

## పదవ తరగతి టాపర్లకు..
# చెక్కులు అందజేత



**చేవెళ్ల, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని అతిథి గృహంలో స్థానిక బిజెపి నాయకులు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం సమక్షంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మండల, మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి టాపర్ లకు విశ్వేశ్వర్ రెడ్డి ఫౌండేషన్ తరపున వారు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్నా, మున్సిపల్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాయకులు పాండు, రాములు, వీరేందర్, లోకేష్, ప్రవీణ్, వెంకట్, ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, హరి గౌడ్, కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రజక సేవా సంఘ మండలేశ్వర్ ఆలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ పూజలు



**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** నగరంలోని మహాలక్ష్మినగర్ లోని జర్నలిస్ట్ కాలనీలోని రజక సంఘం మండలేశ్వర్ ఆలయంలో ఎమ్మెల్యే ధన్ పాస్వర్డ్ నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే ధన్ పాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ధన్ పాల్ ను సన్మానించారు. ఈ కార్యక్రమం లో మైలారం శ్రీనివాస్,దశరథ్, గోపి, రమణ, దేవయ్య, కృష్ణ, బాలరాజ్, నరసయ్య, రాజు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మృతి

- రఘుకు నివాళులర్పించిన పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు, రాజకీయ ప్రముఖులు



**కోదాడ, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు పడిశాల రఘు బుధవారం మృతి చెందారు. మంగళవారం సాయంత్రం అనారోగ్యం కారణంగా పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం తీసుకువెళ్లాలని వైద్యుడు సూచించడంతో అంబులెన్స్ లో ఖమ్మం వెళ్తూ మార్గమధ్యంలో మృతి చెందినట్లుగా బంధువులు తెలిపారు. దీంతో రఘు కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. నియోజకవర్గం వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. రఘు జర్నలిస్టుగా అనంతకాలంలోనే అంచలంచెలుగా ఎదుగుతూ సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కారింగుల అంజన్ గౌడ్ సారథ్యంలో కోదాడ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. రఘు చివరి అంతిమయాత్రలో జర్నలిస్టులు భారీ స్థాయిలో పాల్గొని పాడే మోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. జోహార్ రఘు అనే నినాదాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. రఘు పార్థివ దేహానికి, సూర్యాపేట పట్టణ డి.ఎస్.పి రవి,సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బషీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రనేని వెంకటరత్నం బాబు, ఎమ్మెస్ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పందిరి నాగిరెడ్డి, ఎం జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాద రమేష్, టిఆర్ఎస్ నాయకులు బెజవాడ శ్రవణ్ ,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నహీం,రేస్ ఐ ఐ టి మెడికల్ కళాశాల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిరికొండ శ్రీనివాస్, జర్నలిస్టు సంఘ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.

## విద్యార్థి దశ నుండే..
# నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



**సైదాపూర్/భీమదేవరపల్లి ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గుజ్జుల పల్లె గ్రామంలో శివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సేవ చేయుటకు వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటరీలు సుమారు 15 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు. వీరి సేవలను గుర్తించి బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ విద్యార్థిని విద్యార్థులను చిన్న వయసు నుండే సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని జీవితంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు చేసిన సేవలు అభినందించారు ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఏనుగు మహిపాల్ రెడ్డి ప్రిన్సిపల్ బి ప్రవీణ్ రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మేకల నవీన్ కుమార్ ఆలయ కమిటీ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని చిన్నారులు చేసిన సేవలను అభినందించారు.

# నేడే ఎమ్మెల్సీ ఎన్నికలు



- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ప్రలోభాలకు లొంగకుండా పట్టభద్రులు, టీచర్లు ఓటు వేయాలి

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** ఉమ్మడి కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ (గ్రాడ్యుయేట్), (ఉపాధ్యాయ) ఎమ్మెల్సీ స్థానానికి నేడు భీమదేవరపల్లి మండలంలో పోలింగ్ జరగనుంది. పోలింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోలింగ్ జోనల్ ఆఫీసర్ పద్మ తెలిపారు. భీమదేవరపల్లి మండల పరిధిలో 1375 మంది పట్టభద్రులు,53 మంది టీచర్స్ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. భీమదేవరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ పోలింగ్ విధుల్లో 12 మంది పోలింగ్ సిబ్బందితో, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని జోనల్ ఆఫీసర్ పద్మ తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు.

# శివుడికి జలాభిషేకం నిర్వహిస్తే శుభపరిణామం





## ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు 132 – జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలోని శ్రీ దుర్గా చిదంబర నట్నేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన విశేష పూజలకు శాసనసభ బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జలాభిషేకం నిర్వహిస్తే సకల శుభాలు కరుగుతాయని పేర్కొన్నారు. స్వామి వారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా అష్టైశ్వర్యములతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలె శ్రీకాంత్, జగద్గిరిగుట్ట వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు కాలే గణేష్, బాల మల్లేష్, పులి మహేష్, ఆర్.మల్లా గౌడ్, అనిల్, లోకేష్ రామ్ గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# తరచూ ఇంట్లో తల్లిదండ్రుల గొడవలు

- మనస్తాపంతో ఇల్లు వదిలివెళ్లిన కూతురు



**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి26,(నినాదం న్యూస్):** మల్కాజిగిరి నేరేడిమేట్ పరిధి వివేకాందపురంకు చెందిన 22 సవంత్సరాల యువతి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు.. తరచు తల్లిదండ్రులు గొడవలు పడుతుండటం చూసి మనస్తాపంతో ఇల్లు వదిలి వెళ్ళిందని సమాచారం.. తల్లి జుమ్మీ మొహంతా వైఫ్ ఆఫ్ ప్రదీప్ కుమార్ మొహంతా వయసు 44 సంవత్సరాలు నెరేడ్ మెట్ పీఎస్‌లో తన కూతురు కనిపిచడం లేదని పిర్యాదు చేసింది అని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు తరచూ ఇంట్లో గొడవలు పెట్టుకుంటూ ఉండడంతో తను మనస్థాపానికి గురై బుధవారం ఉదయం 6 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తన యొక్క ఫ్రెండ్స్ బంధుమిత్రులు అన్ని చోట్ల వెతికిన ఎక్కడ తన ఆచూకీ లభించలేదు. ఆమె యొక్క వివరాలు ఎత్తు 5.3 రంగు వైట్ కలరు తెలుగు హిందీ బెంగాలీ ఇంగ్లీష్ మాట్లాడగలదు దుస్తులు బ్లూ కలర్ టాప్ బ్లాక్ జీన్స్ ధరించినది తన ఆచూకీ ఎవరికైనా తెలిసినచో నేరేడ్మెట్ పిఎస్ కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

## బీరంగూడ గుట్ట ఆలయంలో..
# పోటెత్తిన భక్తజనం



**జిన్నారం/పటాన్‌చెరు, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పోటెత్తిన భక్తులు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బైంసా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ.... ఉదయం 2 గంటల నుండి 4 గంటల వరకు స్వామివారికి అభిషేకాలు జరిగాయని, నాలుగు గంటల నుండి ధర్మదర్శనం ప్రారంభమైందని ఆరు గంటల నుండి స్వామివారిని భక్తులు యధావిధిగా దర్శనం చేసుకుంటున్నారని అన్నారు. దర్శనానికి 500, 300, 100, టికెట్ లైను, విఐపి, వివిఐపి, లైను, మరియు విఐపి పాస్, ధర్మ దర్శనం, క్యూ లైన్ లలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎక్కడికక్కడ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రవేట్ హాస్పిటల్స్ వారు కొన్ని మెడికల్ క్యాంపులు అంబులెన్స్ డాక్టర్స్ సిబ్బందిని కూడా నిర్వహించారని అలాగే భక్తులకు ఆహారం, నీరు సదుపాయం అన్ని విధాల ఏర్పాటు చేస్తామని అన్నారు.

# పరమశివుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

- ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య



**చేవెళ్ల, ఫిబ్రవరి26(నినాదం న్యూస్):** పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైన ఉండాలని శాసనసభ్యులు ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆకాంక్షించారు.మహాశివరాత్రి, పురస్కరించుకొని చేవెళ్లలోని శివాలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో ఆలయాలు మారుమోగుతున్నాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే పవిత్ర స్నానాలు ఆచరించి,మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో కోనగట్టు శివాలయంలోని శాసనసభ్యులు కాలే యాదయ్య స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో పరమశివుడి ఆశీస్సులు చల్లని కృప ప్రతి ఒక్కరి పైన ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ పెంటయ్య గౌడ్ డిసిసి ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి సీనియర్ నాయకులు సున్నపు వసంతం మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి మంగలి యాదగిరి టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాలకు పోటెత్తిన భక్తులు



**చింతపల్లి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని వివధ గ్రామాల్లో ఉన్న శివాలయాలకు బుధవారం భక్తులు పోటెత్తారు.మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, తీదేడు వి టి.నగర్,గడియ గౌరారం, గ్రామాలలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కురుమేడు,నెలువలపల్లి గ్రామాలలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం, చింతపల్లి లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం వేళలో ఉపవాస దీక్షలు విరమించి రాత్రి వేళలో జాగారాలు చేశారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా మండలంలోని కుర్మపల్లి లో ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ముంజంపల్లి విద్యాధర్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయా ఆలయాల చైర్మన్లు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



# మోడీ ద్వయం ఏమి చేయబోతున్నది..?

ప్రధాని మోడీ, అమిత్‌షాలు నిశ్శబ్దంగా ఉన్నారంటే ఎవరికో మూడినట్లే. వారు ఏదైనా అలజడి సృష్టించే ముందు ప్రశాంతంగా ఉంటారు. ఎవ్వరికీ అంతుచక్కకుండా ఉంటారు. వారి వ్యూహాలను పసిగట్టడం వారితో ఉన్నా వారికి కూడా తెలియదు. కాంగ్రెస్ ముక్తభారత్ నినాదంతో రాజకీయాలు నెరిపిన మోడీ కొంతవరకు విజయం సాధించారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు పార్లమెంటులో ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. అయితే ఇదొక్కటే చేయడం వల్ల ప్రజలు హర్షించరు..గుర్తించరని వారు గమనించలేక పోయారు. అందుకే గత ఎన్నికల్లో కాంగ్రెస్ వందసీట్లు గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో అడుగుపెట్టింది. ఆ పార్టీ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. వయనాడ్‌తో పాటు రాయబరేలీలో కూడ రాహుల్ గెలిచి, వయనాడ్‌లో చెల్లెలు ప్రియాంకను మెల్లంగా లోక్‌సభ గడప తొక్కేలా చేశారు. అంతకుముందే తల్లి సోనియా రాజ్యసభలో చేరారు. మొత్తంగా కుటుంబం అంతా పార్లమెంటులో ఉన్నారు. ఇక మిగిలింది రాబర్ట్ వాద్రా మాత్రమే. ఆయన కూడా కర్నాటక లేదా తెలంగాన నుంచి రాజ్యసభ మెట్లు తొక్కినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. అయితే ఇదంతా కాంగ్రెస్ వైపు కనిపిస్తున్న కోణం. మోడీ కోణం మరోటిగా ఉంది. కేవలం 240 సీట్లకే పరిమితమైన బిజెపి, మొన్నటి ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ సాధించలేకపోయింది. ఈ క్రమంలో మళ్లీ కమలం ఆపరేషన్ మొదలవుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తమ కాంగ్రెస్ ముక్త భారత్ వ్యూహంలో భాగంగా మెల్లగా అడుగులు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మరో ఐదేళ్ల వరకు అధికారం కోసం వేచిచూడక తప్పదు. ఈలోగా పార్టీలో ఉన్న వృద్ధనేతలకు అంతకాలం వేచిచూసే ఓపిక ఉండదు. రాజకీయాల్లో ఇప్పుడు తమ వయసురీత్యా కూడా రాజకీయాలు నెరపుతున్నారు. తాజాగా శశిథరూర్ మోడీకి దగ్గరవుతున్నారన్న సంకేతాలు...తుఫాన్‌కు ముందు ప్రశాంతత లాంటివనే చెప్పాలి. అయితే తాను పార్టీ వీడడం లేదని శశిథరూర్ స్పష్టం చేసారు. ప్రతి రాజకీయవేత్త పార్టీ మారు క్రమంలో చేసే సాధారణ ప్రకటన ఇది. అయితే ఒక్క శశిథరూర్ కోసం మోడీ ద్వయం ప్రయత్నించదని గుర్తించాలి. ఆయనతోపాటు మరికొందరి కోసం గాలం వేసివుంటారు. కాంగ్రెస్‌ను చీల్చి చెండాడడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నారు. రాహుల్ నాయకత్వం పట్ల విశ్వాసం లేని వారు వీరివలలో పడడం ఖాయం. కేరళలో సొంతంగా ప్రజలలో ఇమేజ్‌ను ఆసరా చేసుకొని వరుసగా నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ ఇప్పుడు పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న రాహుల్ గాంధీపై తిరుగుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. వరుసగా హర్యానా,మహారాష్ట్ర, ఢిల్లీలలో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న తర్వాత 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అన్ని దూరం అవుతున్న సమయంలో శశిథరూర్ వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ శ్రేణులను కలవరం పరుస్తున్న మాట నిజం. 2019లో పార్టీ పరాజయం తర్వాత, 2020లో ఐదుగురు మాజీ ముఖ్యమంత్రులు, పలువురు ఎంపిలు, మాజీ కేంద్ర మంత్రులతో కలిసి 23 మంది పార్టీ అధినేత్రికి రాసిన లేఖలో సైతం తిరుగుబాటు ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలో గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్ లాంటి వారు తమదారి తాము చూసుకున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ఇకముందు సంపూర్ణ మెజార్టీతో తిరిగి అధికారంలోకి వస్తుందని నేతలకు నమ్మకం పోయింది. అందుకే శశిథరూర్ తిరుగుబాటును ఆ విధంగా కొట్టిపారివేయ లేము. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అక్టోబర్, 2022లో జరిగిన ఎన్నికల్లో గాంధీ కుటుంబం బలపరిచిన మల్లికార్జున్ ఖర్గేపై పోటీ చేసి మొత్తం 5000 మంది ఓటర్లలో 1500కు పైగా ఓట్లు సంపాదించడం పార్టీలో విస్తృత ప్రతిపాదికలో థరూర్‌కు గల మద్దతును తెలుపుతున్నది. నిజంగా ఆ నాడు థరూర్‌ను పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకొని ఉంటే నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ బలమైన ప్రాతిపదికను ఏర్పరచుకొని ఉండేదని పలువురు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ను కలిసేందుకు ప్రధాని మోడీ ప్రత్యేకంగా అమెరికాకు వెళ్లిన సందర్భంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తే, శశిథరూర్ మాత్రం ఫలవంతమైన పర్యటన అని పొగడ్తలతో ముంచెత్తారు. అక్రమ వలసదారులు అమానుష రీతిలో పంపడాన్ని మోడీ ప్రస్తావిస్తే బాగుండెడిది అని చురకలు అంటిస్తూనే టారిఫ్‌ల విషయంలో వెంటనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకోకుండా చర్చల పేరుతో వాయిదా వేయగలిగారని కొనియాడారు. తమ రాజకీయ ప్రత్యర్థులను థరూర్ పొగడ్తలతో ముంచెత్తడం సహజంగానే కాంగ్రెస్ నేతలకు ఆగ్రహం కలిగించింది. విదేశీ పర్యటనలో ఉన్న థరూర్ తో వెంటనే మాట్లాడాలని స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. ఫిబ్రవరి 18న రాహుల్‌ను కలిసిన థరూర్ తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటో ముందు స్పష్టం చేయమని రాహుల్ గాంధీని నిలదీశారు. పార్లమెంట్ చర్చలలో పార్టీ ప్రతినిధిగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పార్టీలో సైతం తనకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఏ కమిటీలో తనకు అవకాశం ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ విషయాలపై ఎటువంటి సమాధానం ఇవ్వలేక రాహుల్ గాంధీ మౌనం వహించినట్లు తెలుస్తున్నది. అంతేకాదు, తాను ఇప్పటికీ పార్టీకి అందుబాటులోనే ఉన్నానని చెబుతూనే తన అవసరం లేదని పార్టీ భావిస్తే తనకూ వేరే మార్గాలు ఉన్నాయని ఆ తర్వాత స్పష్టంగా హెచ్చరించారు. అంటే థరూర్ ధిక్కార ధోరణి మొదలయ్యిందనే చెప్పాలి. ఇక్కడ ఒక్క థరూర్ మాత్రమే మనకు పైకి కనిపిస్తున్నారు. కానీ కాగ్రెస్ పుట్టి ముంచడానికి అనేకులు సిద్దంగా ఉండివుంటారు. కాంగ్రెస్‌కు బీటల వేయడంలో థరూర్ అడుగు వేస్తే మరికొందరు ముందుకు రావచ్చు. మహారాష్ట్ర తరహాలో కాంగ్రెస్ చీలిక అనివార్యం కావచ్చు. మోడీ ద్వయం ప్రశాంతతకు ఇది కారణం కూడా కావచ్చు. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చు. జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటి సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో తమ పీఠాన్ని బలోపేతం చేసుకునే పనిలో మోడీ ద్వయం ఏమైనా చేసే అవకాశం ఉంది.

# దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం

**జ్యోతిర్లింగ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు**
**ఉజ్జయినిలో సిఎం మోహన్ యాదవ్ దంపతుల పూజలు**
**గోరఖ్‌పూర్‌లో యోగి ఆదిత్యానాథ్ ప్రత్యేక పూజలు**





**న్యూఢిల్లీ, నినాదం:**

దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు మహా వేడుకగా జరుపుకున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వారణాసి, ఉజ్జయిని, సోమ్‌నాథ్ వంటి ప్రధాన శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరక్‌పూర్‌లో సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దంపతులు ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. ఆ ఆలయంలో ఇవాళ తెల్లవారుజామున భస్మహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుడికి ఇవాళ ఉదయం ప్రత్యేక హారతి ఇచ్చారు. కాశీలో వేల సంఖ్యలో భక్తులు విశ్వనాథుడి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర అక్కడ భక్తులు క్యూ కట్టనట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఢిల్లీలోని గౌరీశంకర్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. హరిద్వార్‌లోని ధాకేశ్వర్ మహాదేవ్ ఆలయం వద్ద భక్తులు భారీ క్యూలైన్ కట్టారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో త్రినేత్రుడి దర్శనం చేసుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రమైన బాబా బైద్యనాథ్ ఆలయంలో కూడా భక్తులు కిటకిటలాడిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న అలువ మహాదేవ్ ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుజారాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయంలో వేకువజాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. రామేశ్వరంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సముద్రస్నానాలు ఆచరించి శివుడి దర్శనం చేసుకు న్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న శివాలయాల్లో వేకువ జామునుంచే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీకాళహస్తిలోని శివాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో ఆలయ దర్శనం కోసం వస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెల్లవారు జామున హనుమకొండ లోని వెయ్యి స్తంభాల గుడిలో పూజలు నిర్వహించారు. గ్వాలియర్‌లో ఉన్న అచలేశ్వర్ ఆలయంలో కూడా భక్తులు పెద్దగా ఎత్తున దర్శనాలు చేసుకున్నారు. ఏపీలోని శ్రీశైలంలో కూడా భారీగా పూజలు నిర్వహించారు.

## వేములవాడలో శివరాత్రి సందడి

**భారీగా తరలివచ్చిన భక్తజనం**
**స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన బండి**
**రాజన్న సేవలో ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్**

శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయాన్ని కేంద్ర హోంశాఖ సహయ మంత్రి బండి సంజయ్ సందర్శించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. రాజన్న దర్శనం అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ 'మహా శివరాత్రి సందర్భంగా రాజన్నను దర్శనం చేసుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దక్షిణ కాశీగా పిలువబడే రాజన్న ఆలయానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి కూడా భక్తులు వస్తున్నారు. రాజన్న ఆలయం మోస్ట్ పవర్ ఫుల్. దేశ ప్రధాని వేములవాడ రాజన్నను దర్శనం చేసుకున్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా ఒక చర్చ కొనసాగుతుంది. ప్రధాని దర్శనం నుండి దేశ ప్రజలు కూడా వేములవాడకి వెళ్లానుకుంటు న్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ఈఓ, సిబ్బంది, సేవ సంస్థలను అభినందిస్తు న్నాను. ఇదే స్ఫూర్తితో చివరివరకు భక్తులకు సౌకర్యాలు కొనసాగించాలని సూచించారు. వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తులు ప్రధాన ఆలయంలో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోంది. దాంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అర్ధరాత్రి నుంచే క్యూలో 6 గంటల పాటు వేచి ఉన్నప్పటికీ దర్శనం కాలేదని, ప్రధాన ఆలయంలోకి అనుమతించలేదని కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న దర్శనం కాకుండానే శిఖర దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. వీఐపీలు, అధికారులు అధిక సంఖ్యలో బంధువులకు నేరుగా దర్శనం చేయిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇవో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## పోటెత్తిన జనం

**ప్రత్యేక పూజలు చేసిన కిషన్ రెడ్డి**

హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాళేశ్వరం, వేములవాడ, కీసర తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేములవాడ రాజన్న క్షేత్రం భక్తుల శివ నామస్మరణతో మార్మోగిపోతోంది. భక్తులు స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి.. దర్శనానికి క్యూ లైన్లో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి ఆరు గంటల సమయం పడుతోంది. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి అద్దాల మండపంలో అనువంశిక అర్చకులచే మహాలింగార్చన కార్యక్రమం ఉంటుంది. రాత్రి లింగోద్భవ సమయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం జరగనుంది. కాళేశ్వరం క్షేత్రంలో మహాశివరాత్రి శోభ కనిపిస్తోంది. తెలంగాణతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుండి భక్తులు కాళేశ్వరంకు తరలివచ్చారు. త్రివేణి సంగమ గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించి.. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు.

# రాజ్యసభ బరిలో కేజ్రీవాల్

## పంజాబ్ నుంచి నామినేట్ అయ్యే ఛాన్స్

## జోరుగా మీడియా కథనాలు...కొట్టి పారేసిన ఆప్



న్యూఢిల్లీ : ఢిల్లీలో అధికారం కోల్పోవడంతో ఆప్ అధినేత కేజ్రీవాల్ రాజకీయంగా బలంగా మారేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. అందుకు పార్లమెంట్‌ను వేదిక చేసుకునే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. ఢిల్లీలో ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. పంజాబ్ సిఎం అవుతారంటూ ఇటీవల కొన్ని కథనాలు వచ్చాయి. అయితే అలాంటి సాహసం చేసి పార్టీ పరువును తీసుకునే ప్రయత్నం చేయకపోవచ్చు. మోదీని ఢీకొనాలంటే పార్లమెంటులో ఉండాలన్న యోచనలో ఉండివుండవచ్చు. ఈ క్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇక పార్లమెంట్‌లో అడుగుపెట్టనున్నారన్న ప్రచారం ఒకటి చక్కర్లుకొడుతోంది. పార్టీలో తాజా పరిణామాలతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆయనను త్వరలోనే రాజ్యసభకు పంపించేందుకు ఆప్ ముమ్మర సన్నాహాలు చేస్తున్నట్లు కథనాలు వెలువడు తున్నాయి. అయితే, వీటిని పార్టీ తోసిపుచ్చింది.ప్రస్తుతం రాజ్యసభలో ఉన్న ఆప్ ఎంపీ సంజీవ్ అరోరాను పార్టీ పంజాబ్ ఉప ఎన్నికల బరిలో నిలబెట్టింది. త్వరలో జరగబోయే లూథియానా వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిగా సంజీవ్ పేరును ఖరారు చేస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో కేజ్రీవాల్ పార్లమెంట్ ప్రవేశంపై వార్తలు గుప్పుమన్నాయి. సంజీవ్ అరోరా 2022లో పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2028లో ముగియనుంది. కాగా.. లూథియానా వెస్ట్ నుంచి ఎన్నికైన ఆప్ ఎమ్మెల్యే గుర్‌ప్రీత్ గోగి గత నెల మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో పార్టీ సంజీవ్‌ను బరిలోకి దించింది. ఉప ఎన్నికల్లో ఆయన గెలుపొందే అవకాశాలు ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, ఆ పదవిలో కొనసాగాలనుకుంటే.. రాజ్యసభ సభ్యత్వాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. అప్పుడు పెద్దల సభలో ఖాళీ అయ్యే ఆ స్థానానికి కేజీవ్రాల్‌ను పంపించాలని ఆప్ భావిస్తున్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిరచాయి.అయితే, ఈ ప్రచారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఖండిరచింది. అవన్నీ వదంతులేనని ఆప్ పంజాబ్ విభాగ అధికార ప్రతినిధి జగ్తర్ సింగ్ వెల్లడిరచారు. కేజీవ్రాల్‌ను రాజ్యసభకు పంపించే అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇక, ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన పార్టీ అధినేత కేజీవ్రాల్ కూడా ఓడిపోయారు. ఆయన పోటీ చేసిన న్యూదిల్లీ శాసనసభ నియోజకవర్గం నుంచి భాజపా నేత పర్వేశ్‌వర్మ విజయం సాధించారు. ప్రస్తుతం దిల్లీ అసెంబ్లీలో మాజీ సీఎం ఆతిశీ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఈక్రమంలో పార్లమెంటులో ఉండడమే శ్రేయస్కరమని కేజ్రీవాల్ భావిస్తున్నారు. లేకుంటే పార్టీని కాపాడుకోవడం కష్టం కావచ్చు.

## రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా తెలంగాణకు

# ఒరిగేదేమీ లేదు

**: మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, నినాదం:

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లూ ఢిల్లీ టూర్‌కు వెళ్లిన తెలంగాణకు ఒరిగేదేమీ లేదని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని విమర్శించారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది కార్మికులు చిక్కుకుంటే.. ఎన్నికల ప్రచారంలో మునిగి తేలావని మండిపడ్డారు. మూడు నెలలుగా జీతాల్లేక అల్లాడుతున్నామని కార్మికులు వాపోతుంటే ఎన్నికల ప్రచారం ముగించుకుని నిమ్మలంగా మళ్లీ హస్తిన బాటపట్టావని అన్నారు. సొరంగంలో సహాయక చర్యలు ఒక్కడుగు ముందుకు.. వందడుగులు వెనక్కి అన్నట్లుగా ఉందని కేటీఆర్ విమర్శించారు. అక్కడ ఆక్సిజన్ లేదు.. కన్వేయర్ బెల్టు తెగిపోయిందని తెలిపారు. 96 గంటలు దాటినా ఒక్కడుగూ ముందుకు పడటం లేదని తెలిపారు. కాళేశ్వరం పర్రెల మీద శ్రీశైలం అగ్నిప్రమాదం మీద కారు కూతలు కూసి, విషపు రాతలు రాసిన మేధావుల నోళ్లు ఎస్‌ఎల్‌బీసీ విషయంలో మాత్రం నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హస్తిన యాత్రలు మాని.. ఆ కార్మికుల గోడు వినాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు.

# కుంభమేళాలో హరహరమహదేవ్



## భారీగా తరలివచ్చిన భక్తజనం చివరిరోజు..శివరాత్రి కావడంతో పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్:

ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా మొదలైన మహాకుంభమేళాకు చివరి రోజు కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు పుణ్యస్నానాలకు పోటెత్తారు. పుణ్యతిథి కావడంతో భారీగా భక్తుల తరలివచ్చారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక ఇక ముగియనుంది. ఈక్రమంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. ఇప్పటివరకు 64 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. ఈ కుంభమేళాలో నేడు చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికారులు భక్తులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలని కోరారు. ఇక, ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఇదిలాఉండగా.. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్ గా అధికారులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దీన్ని అమలుచేశారు. స్థానికుల కోసం నిత్యావసర సరకులు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బుధవారం 350 రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. జనవరి 13న ప్రారంభమైన ఈ కుంభమేళా దాదాపు 45 రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటికే రికార్డ్ స్థాయిలో 63.36 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవంగా కుంభమేళా నిలిచింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర కోట్లాది మంది భక్తులంతా పుణ్యస్నానాలు ఆచరించారు. ఇదిలా ఉంటే ఈ కుంభమేళాకు యూపీ ప్రభుత్వం ప్రగడ్బందీగా ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక గుడారాలు, టాయిలెట్లు ఏర్పాటు చేసింది. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసింది. ఇక తప్పిపోయిన వారి సమాచారం తెలియజేసేందుకు 24 గంటలు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య సౌకర్యాలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ కుంభమేళా జరుగుతుంది. అయితే ఈసారి ఊహించని రీతిలో భక్తులు రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పెట్రోల్, ఆహార కొరత ఏర్పడిరది. ఇక జనవరి 26న మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మందికి పైగా మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఇక న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కూడా మరో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు అంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఇక ప్రతిపక్షాల విమర్శలను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తిప్పికొట్టారు.

### కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు

# భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలి



**ఆళ్లపల్లి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లా పీఠం, రోమన్ కతోలిక మిషన్ మహా ఘనత వహించిన బిషప్ సగిలి ప్రకాష్, హైదరాబాద్ ప్రధాన చర్చి ఆర్చి బిషప్ పూల అంతోని ఆదేశాల మేరకు, ఫిబ్రవరి 27 నుండి మార్చి 2 వరకు జరిగే కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలకు ఉమ్మడి గుండాల ఆళ్లపల్లి మండలాలలోని క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆ దేవాది దేవుని కృపావరాలను పొందుకోవాలని, స్థానిక పునీత పౌల్, పేతురు దేవాలయ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కూరపాటి యాకోబు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలత జగద్గురువులు ఫ్రాన్సిస్ పోప్ ఆరోగ్య రీత్యా ప్రతిరోజు క్రైస్తవ భక్తులు ప్రార్థనలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ పూజలు





**వైరా, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** వైరా నియోజకవర్గంలోని పురాతన పుణ్యక్షేత్రమైన స్నానాల లక్ష్మీపురంలో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి పూజలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుండాలని పూజలు నిర్వహించినట్లు వివరించారు. అనంతరం శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అల్పాహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ వైరా మున్సిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి ధర్నా రాజశేఖర్ పలువు నాయకులు పాల్గొన్నారు.

# నేటినుంచి కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలు

- కరుణగిరి డైరెక్టర్ ఫాదర్ మాథ్యూ వరప్రసాద్ రాజు



**ఖమ్మం, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** సుప్రసిద్ధ కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవములు గురువారం నుంచి ప్రారంభమవుతున్నాయని కరుణగిరి డైరెక్టర్ ఫాదర్ మాథ్యూ వరప్రసాద్ రాజు తెలియజేశారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవములు వచ్చేనెల రెండవ తేదీ వరకు జరుగుతున్నాయన్నారు. ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని నుంచి వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారని తెలియజేశారు. ఈనెల 27 గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ఆర్.సి.యం ఖమ్మం మేత్రరాసనం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ పతాకావిష్కరణ చేసి దివ్య బలి పూజతో మహోత్సవములను ప్రారంభించనున్నారని తెలిపారు. ఈనెల 28వ తేదీ శుక్రవారం ఏలూరు డివైన్ వర్డ్ రిట్రీట్ సెంటర్ ఎస్ వి డి ఫాదర్ బెన్నీ చే ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రసంగం, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీన ఖమ్మం మేత్రరాసనం విశ్రాంత పీఠాధిపతి మైపన్ పాల్ చే ప్రత్యేక దివ్య బలి పూజ ఉంటుందన్నారు. కరుణామయని రథంతో ప్రదక్షణ, తప్పిపోయిన కుమారుడు నాటక ప్రదర్శన ఉంటుందని ఫాదర్ మాథ్యూ వరప్రసాద్ రాజు తెలియజేశారు. చివరి రోజు మార్చి రెండవ తేదీ ఆదివారం ఉదయం కర్నూలు పీఠకాపరి డిడి గోరంట్ల జ్యానేష్, ఖమ్మం మేత్రారాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్, మత గురువుల ఆధ్వర్యంలో పండుగ సమిష్టి దివ్య బలి పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ దివ్యపూజ అనంతరం పురుషులకు, మహిళలకు విడివిడిగా కోలాటం పోటీలు నిర్వహిస్తామని , విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించడం జరుగుతుందని, నాలుగు రోజులపాటు జరిగే కరుణగిరి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కరుణగిరి డైరెక్టర్ ఫాదర్ మాథ్యూ వరప్రసాద్ రాజు తెలియజేశారు.

# దుర్గేశ్వర స్వామికి.. ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు

- పూర్వ రాతిబావి నీళ్లతో శివయ్యకు అభిషేకం





**దమ్మపేట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మండల పరిధిలోని గుర్వాయిగూడెం గ్రామ శివారులో ఉన్న కాకతీయుల కాలం నాటి శ్రీ శంకరగిరి దుర్గేశ్వర స్వామి (దుర్గమ్మ గట్టు)పై మహాశివరాత్రి పురస్కరించుకొని స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో కాకతీయ వంశంలో చివరి రాజు అయినా ప్రతాపరుద్రుడు ఆలయానికి సుదూర ప్రాంతంలో రాతిబావిని నిర్మించి ఆ నీళ్లతో స్వామివారికి అభిషేకాలు చేసేవారు. రాను రాను కాలక్రమేనా ఈ చారిత్రిక దేవాలయం ఆదరణ కోల్పోయి శిథిలావస్థకు చేరింది. మహాశివరాత్రి పురస్కరించుకొని స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవ చూపి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు. సతీసామెతంగా పురాతన రాతి బావిలోని నీళ్లను ఎంతో శ్రమించి తీసుకొచ్చి శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సకల సౌకర్యాలు కల్పించి పూర్వ వైభవం తీసుకొచ్చి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు.

## నియోజకవర్గ ప్రజలు

# సుభిక్షంగా ఉండాలి

- రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పూజలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులకు సన్మానం






**వైరా, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):**

వైరా నియోజకవర్గంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్నానాల లక్ష్మీపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వైరా కొణిజర్ల కారేపల్లి జూలూరుపాడు ఏన్కూరు మండలాలు ప్రజలు సుభిక్షంగా ఉండాలని పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డిల సహకారంతో ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఏ నియోజకవర్గ ప్రజల సుభిక్షంగా ఉండాలని ఆలయంలో పూజలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లలిత దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు విగ్నేష్ పమ్మీ అశోక్ మచ్చ వెంకటేశ్వర్లు మల్లు రామకృష్ణ వీరయ్య చౌదరి ధర్నా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి





- స్వగ్రామంలో డిప్యూటీ సీఎం దంపతులు పూజలు
- వైరా నదిని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం
- మిఠాయి స్టాల్స్‌ను సందర్శించిన డిప్యూటీ సీఎం

**వైరా, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** వైరా నియోజకవర్గంలోని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో పురాతన పుణ్యక్షేత్రం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నందిని దంపతులకు ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాహుల్ గాంధీ గోత్రనామమైన దత్తాత్రేయ గోత్రంతో శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో బట్టి విక్రమార్క దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టి విక్రమార్క నందిని దంపతులను ఆలయ హత్యకులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ గోత్రం పేరుతో శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. రాహుల్ గాంధీ రాజకీయంగా ఉన్నతి పదవులు అలంకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. శివరాత్రి పర్వదినం రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి సుఖసంతోషాలు కలగజేయాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎప్పుడు సుభిక్షంగా ఉండాలని శ్రీ రామలింగేశ్వర స్వామిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయమునకు ఎంతో పురాతన చరిత్ర ఉందని ఆయన వివరించారు. భక్తుల కొంగుబంగారంగా ఈ దేవాలయం ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా పేరుగాంచిందని కొనియాడారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్కనందిని దంపతులు ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ చిన్ననాటి స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య దొడ్డ పుల్లయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్



- పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరు పరిశీలన

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :** నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం సందర్శించారు. నిజామాబాద్ డివిజన్ కు సంబంధించి నిజామాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఏ.పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆర్టీసీ బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా, జిల్లాలో 81 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓ కార్యాలయాలతో పాటు బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు పీ.ఓ, ఏపీ.ఓ, ఇద్దరు ఓపీఓలతో పాటు అదనపు సిబ్బందిని నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ పోలింగ్ విధులను పకడ్బందీగా చేపట్టాలి





- ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం , ఫిబ్రవరి26( నినాదం న్యూస్):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అప్పజెప్పాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ, ఒకటికి రెండు సార్లు పోలింగ్ సామగ్రి సరిచూసుకొని తీసుకొని వెళ్ళాలని, ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం ఖమ్మం జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని, మొత్తం 4089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 9 సెక్టార్ అధికారులు, 28 ప్రిసైడింగ్ అధికారులు, 27 అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు, 58 ఇతర పోలింగ్ సిబ్బంది , 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు, 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది, సామాగ్రిని తరలిస్తున్నామని, వీటి కోసం 8 ఆర్టీసీ బస్సులను సన్నద్ధం చేశామని అన్నారు.

ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన చల్లని నీరు, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని, జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధ్యాయ ఓటర్లందరూ తప్పనిసరిగా ఫిబ్రవరి 27న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పిలుపు నిచ్చారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని అదనపు కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పోలింగ్ సామాగ్రితో ఎన్నికల విధుల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి తరలివెళ్లి, పోలింగ్ కేంద్రంలో గురువారం నాటి పోలింగ్ కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిణి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఎన్. అరుణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి కాసాని ఐలయ్య

- సీపీఎం రాష్ట్ర నాయకుడు తమ్మినేని



**ఖమ్మం, ఫిబ్రవరి26(నినాదం న్యూస్):** ప్రాణం పోయేంతవరకు ప్రజల కోసమే పోరాడిన కాసాని ఐలయ్య పేద ప్రజల పక్షపాతి అని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం నాడు సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో సుందరయ్య భవనంలో ఇటీవల మరణించిన సిపిఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన తమ్మినేని ప్రసంగిస్తూ రైతు కూలీల, కార్మికుల, వృత్తిదారుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలకు ఐలయ్య నాయకత్వం వహించాడన్నారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాలలో పేదలకు ఇండ్ల స్థలాల కోసం అలుపెరగని పోరాటాలు చేశాడని, వేలాది మందికి ఇండ్ల స్థలాలు దక్కాయంటే ఆ ఘనత ఐలయ్యదేనని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వృత్తిదారులందరిని ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించాడన్నారు. పలుసార్లు అనారోగ్యానికి గురైనా, చివరకు క్యాన్సర్‌లాంటి జబ్బుకు గురైనా పోరాటబాట వదలలేదని, ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమాలకు లోటని ఆయన ఆశయాలను కార్యకర్తలు ముందుకు తీసుకుపోవాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ రైతు సంఘాలను, వృత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసి రాజీలేని పోరాటాలు చేసిన ఐలయ్య జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శం అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ భూస్వాములు, పెత్తందారులు, దోపిడీ వర్గాలపై పోరాడిన కాసాని గొప్ప పోరాటయోధుడని, ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగుదామని చెప్పారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా ఐలయ్య చిత్రపటానికి తమ్మినేని పూలమాల వేయగా, నాయకులంతా ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, బండి పద్మ, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, జిల్లావ్యాపితంగా వచ్చిన జిల్లా కమిటి, డివిజన్ కమిటి, మండల కార్యదర్శులు, పూర్తికాలం కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్వ గవర్నర్‌కు ఘన సన్మానం




**వైరా, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** ఖమ్మం నల్గొండ జిల్లాల మాజీ గవర్నర్ గాట్ అంబాసిడర్ వైరా లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణకు గండూరి గార్డెన్స్ సూర్యాపేటలో పూర్వ జిల్లా గవర్నర్ల సన్మానోత్సవ వేడుకల్లో జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సన్మాన గ్రహీత పూర్వ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి పూర్వ గవర్నర్లు జిల్లా అభివృద్ధికి తోడ్పడుతూ హెూమ్ క్లబ్ అభివృద్ధికి తోడ్పడుతు ఉన్నారనీ తెలిపారు. ప్రతి నూతన గవర్నర్ కు జిల్లాలో అన్ని క్లబ్బులు రీజియన్ చైర్మన్లు జోన్ చైర్మన్లు గవర్నర్ చేపట్టిన సేవకార్యక్రమాలకుతోడ్పడుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా గవర్నర్ యారాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పూర్వ గవర్నర్లు అందరూ చక్కగా ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా జిల్లాను ముందుకు తీసుకెళ్లారని పూర్వ జిల్లా గవర్నర్లను సన్మానించడం ఒక పవిత్ర కార్యక్రమాన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ వైస్ డిస్టిక్ గవర్నర్ కె వి ప్రసాద్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ శివశంకర్ సింహాద్రి జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ తుమ్మలూరి మురళీధర్ రెడ్డి జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ లగడపాటి ప్రభాకర్ రావు జీఎస్టీ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు జిఎల్‌టి కోఆర్డినేటర్ సతీష్ కుమార్ కోడె గండూరి కృపాకర్ గుడి పూరి వెంకటేశ్వరరావు మదన్మోహన్ రేపాల డాక్టర్ వసుంధర దేవి వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు సెక్రటరీ అబ్బూరి రమేష్ చింతోజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు

# సర్వం సిద్ధం



**ఆళ్లపల్లి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక తహసిల్దార్ శకుంతల, ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 15 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారన్నారు. మండలంలో ఎన్నికల నిర్వహణకు గాను ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## మాదన్నపేట శివాలయంలో పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



నర్సంపేట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్): వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లోని మాదన్నపేట కట్టపైన ఉన్న శివాలయం నిర్మాణదాత, ప్రముఖ పారిశ్రామిక వేత్త దొడ్డ మోహన్ రావు తో కలిసి నర్సంపేట మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్ది సతీమణి,వరంగల్ జెడ్పి మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, నర్సంపేట మునిసిపల్ కౌన్సిలర్లు పుల్లూరి స్వామి గౌడ్,గందే చంద్రమౌళి దంపతులు, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు మచ్చిక నర్సయ్య గౌడ్, ఎలికట్టే మురళి తదితరులు పాల్గొన్నారు.

## సారీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి



ములుగు ప్రతినిధి, (నినాదం): ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లలిత సారీ సెంటర్ అండ్ క్లాత్ స్టోర్ ను రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క ప్రారంభించారు. సారీ సెంటర్ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :శివరాత్రి పర్వదినం సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం అడ్డాకల్ మండలం కందూరు గ్రామంలోని స్వయంభు రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రాశస్తం ఉందని, కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న స్వయంభు రామలింగేశ్వరుని దర్శించుకుంటే ఏకంగా కాశీ విశ్వేశ్వరున్ని దర్శించుకున్నంత పుణ్యం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కందూరుకు మరో చరిత్ర ఉందని, ఇక్కడ ఉన్న కల్ప వృక్షాలు మరెక్కడా లేవని ఆయన అన్నారు.

## ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీని ములుగు జిల్లాకు కేటాయించాలి

### -బిఆర్ఎస్ జిల్లా నాయకులు రాజమల్ల సుకుమార్



మంగపేట, ఫిబ్రవరి 26( నినాదం న్యూస్ ) : ఎమ్మెల్యే కోటాలో టిఆర్ఎస్ పార్టీకి ప్రస్తుత సభ్యుల సంఖ్యా బలం ప్రకారం ఎమ్మెల్సీ ఒకటి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు నియోజకవర్గానికి చెందిన నాయకులకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు విజ్ఞప్తి చేస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా నాయకులు రాజమల్ల సుకుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన మంగపెతలో స్థానిక విలేకరులతో రాజమల్ల సుకుమార్ మాట్లాడుతూ ములుగు నియోజకవర్గం 1952లో ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ములుగు నియోజకవర్గానికి దాదాపు 73 సంవత్సరాలు గడుస్తున్నా నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎమ్మెల్సీగా ఉన్నటువంటి చరిత్ర ములుగు నియోజకవర్గానికి లేదని, ఏ రాజకీయ పార్టీ నాయకత్వం కూడా ములుగు నియోజకవర్గానికి చెందిన వ్యక్తులకు ఎమ్మెల్సీగా అవకాశాలు కల్పించలేదని అన్నారు. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం ఈసారి కచ్చితంగా ఎమ్మెల్సీ అవకాశం ములుగు నియోజకవర్గానికి సంబంధించిన నేతలకే ఇస్తే నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు, పార్టీ నిర్మాణానికి ఏమ్మెల్సీ పదవి ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్ర నాయకత్వం పార్టీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం కోసం ములుగు జిల్లాకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ములుగు జిల్లాకే కేటాయించాలని రాజమల్ల సుకుమార్ కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం




మహదేవపూర్ ఫిబ్రవరి 26, ( నినాదం న్యూస్): మెదక్, అదిలాబాద్, కరీంనగర్’, నిజామాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను మండలంలో611 మంది పట్టభద్రులు, 14 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయి ఉన్నారు. నేడు గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ ఎన్నికలు జరగనున్నవి. అందుకుగాను అధికారులు ఏర్పాట్లు చేశారు. కాటారం సబ్ కలెక్టర్ మాయంక్ సింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## ఇద్దరు మహిళలు అదృశ్యం






చౌటుప్పల్, ఫిబ్రవరి 26 (నినాదంన్యూస్): మండలంలోని పోలీస్ స్టేషన్ లో ఇద్దరు మహిళలు అదృశ్యమైన కేసులు నమోదు అయినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. మండలంలోని కైతాపురం గ్రామానికి చెందిన గోపనబోయిన లింగస్వామి భార్య లావణ్య బుధవారం తెల్లవారుజాము నుంచి కనబడకుండ పోయింది. ఆందోళన చెందిన లింగస్వామి భార్య ఆచూకి కోసం పరిసరాలు, తెలిసిన బంధువుల వద్ద విచారించగా ఫలితం లేకపోయింది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా చౌటుప్పల్ పట్టణంలో నివాసముండే దేశగోని మల్లేష్ భార్య అలివేలు మంగళవారం మధ్యాహ్నం బ్యాంకుకు వెళ్లి తిరిగి వస్తానని చెప్పి రాకపోవడంతో పరిసరాలు, బంధువుల ఇంట్లో విచారించగా ఆచూకి దొరకలేదు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## అంగవైకల్యం వల్ల ఆర్థిక ఇబ్బందులు..

### -ఆపన్న హస్తం కోసం వికలాంగుడి ఎదురుచూపులు..



కోదాడ/అనంతగిరి,ఫిబ్రవరి 26(నినాదం న్యూస్): అంగవైకల్యం కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని ఆర్థిక సహాయం అందించిఆదుకోవాలని అనంతగిరి మండలం వసంతాపురం ఆవాస గ్రామమైన తెల్ల బండ తండా గ్రామానికి చెందిన గుగులోతూ రమేష్ వేడుకుంటున్నారు. పోలియో వ్యాధి వలన తన రెండు కాళ్లు కోల్పోయానని, అసలే పేద కుటుంబం కావడంతో కుటుంబ పోషణ కోసం ఒక చిన్న డబ్బా కొట్టును నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ప్రస్తుతం ఉన్నటువంటి డబ్బా కొట్టు పూర్తిగా చెదలు పట్టి విరిగిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. తనకు ఆసరాగా ఉన్నటువంటి కొట్టు కూడా కోల్పోతే కుటుంబ పోషణ మరింత భారం అవుతుందని వారు కన్నీటి పర్యంతమయ్యారు. దాతలు ఎవరైనా స్పందించి సహాయ సహకారాలు అందించాలని, అలాగే ప్రభుత్వం నుండి వికలాంగుల స్కూటీని మంజూరు చేసేలా స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చొరవ చూపాలని కోరారు.

# నేటి ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ రాహుల్ శర్మ







భూపాలపల్లి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్): 27వ తేదీన జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జరుగుతున్న పోలింగ్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో ఓటర్లు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు హక్కు వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల్లో పురుషులు 215 మంది మహిళా ఓటర్లు 114 మంది మొత్తం 329 మంది ఓటు హక్కు వినియోగించు కోవడానికి భూపాలపల్లి, మొగుళ్లపల్లి, చిట్యాల, గణపురం, రేగొండ, టేకుమట్ల, కొత్తపల్లి ఘోరి లాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయుల పట్టభద్రులకు మహా దేవపూర్, మహా ముత్తారం, మల్హర్ రావు, కాటారం, పలిమేల మండలాల్లో 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 64 మంది పురుషులు, 19 మంది మహిళలు మొత్తం 83 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పట్టభద్రులకు సంబంధించి నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు 5 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహా దేవపూర్, మహా ముత్తారం, మల్హర్ రావు, కాటారం, పలిమేల మండలాల్లో ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రాల్లో 1734 మంది పురుషులు, 749 మంది మహిళలు మొత్తం 2483 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 27వ తేదీన పోలింగ్ ముగిసిన తదుపరి ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ మెటీరియల్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన పట్ట భద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నాలుగు రూట్లుగా విభజించి ప్రతి రూటుకు ఒక లైజన్ అధికారి, రూటు అధికారులను నియమించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఆరు రూట్స్ ద్వారా 9 పోలింగ్ కేంద్రాలకు చేరిన సామాగ్రి
- అన్ని కేంద్రాల్లో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశాం
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్): జిల్లాలో జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను ఆయన సందర్శించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీఓ, ఏపీఓ, ఓపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గురించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఆర్.సి సెంటర్లో ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చిన ఏపీవో , పిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్లు, అధికారులు పోలింగ్ లో ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా జిల్లాలో 09 పోలింగ్ కేంద్రాలలో గురువారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందించామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీ.ఓ, ఏపీ.ఓ, ఇద్దరు ఓపీఓలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్త జనం

### శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



మంగపేట, ఫిబ్రవరి 26( నినాదం న్యూస్ ) : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలల్ని భక్తులు గోదావరి నదికి చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం తమ సమీపంలోని శివాలయానికి చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆయా ఆలయాలకు విచ్చేసిన భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేసి ఆశ్వీరచనం చేశారు. మంగపేట మండల కేంద్రంలోని శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి దేవాలయం, మల్లూరులోని శ్రీ శంభు లింగేశ్వర స్వామి దేవాలయం, రాజుపేటలోని కొండ లింగేశ్వరస్వామి ఆలయం, వాగొడ్డుగూడెం గ్రామ పంచాయితీలోని లక్ష్మీనర్సాపురం శ్రీ నాగులమ్మ ఆలయ ప్రాంగణంలోని శివాలయానికి భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని పరమశివునికి ప్రత్యేక పూజలు చేశారు. మంగపేటలోని శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు విస్సావజ్ఝల నరేశ్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అర్చనలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి 10 గంటల నుండి శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి కల్యాణ తంతు కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మెన్ కోలగట్ల నరేశ్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లను చేశారు.

## సంక్షేమ అధికారి సుబ్బారెడ్డిని సస్పెండ్ చేయకపోతే కలెక్టరేట్‌లో ఫిర్యాదు

- ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్




వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :వనపర్తి వైద్య కళాశాల హాస్టల్ అద్దె నిధుల దుర్వినియోగంపై పూర్తి ఆధారాలతో వనపర్తి జిల్లా కలెక్టర్, బీసీ వెల్ఫేర్ కమిషర్ పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ ఫిర్యాదు చేయనున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్ తెలిపారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పిడిఎస్యు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డి అవినీతి అక్రమలపై రాష్ట్ర కమిషనర్ కు ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్న చర్యలు మాత్రం లేవని, విచారణకు వచ్చినా రాష్ట్ర అధికారి జిల్లా అవినీతి అధికారితో ములకత్ అయినట్లు ఆయన ఆరోపించారు. విచారణ రిపోర్టు బయట పెట్టకుండా ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మాకు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని చెప్పారు. వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థినుల వసతి కోసం కేటాయించిన అద్దె నిధులను అధికారులు దుర్వినియోగం చేశారని, రూ.13 లక్షల 780 రూపాయలు ప్రభుత్వం నిధులు విడుదల చేయగా ఈ నిధులను చట్టవిరుద్ధంగా వేరే స్వప్రయోజనాలకు మళ్లించారని ఆయన ఆరోపించారు.ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిధుల దుర్వినియోగం చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2016లో జారీ చేసిన ఆర్ సి నెంబర్ బిసి1/1134/92, 27-09-2016 ఉత్తర్వులను సైతం అధికారులు తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం ఖజానా లేక విలవిలలాడుతుంటే జిల్లాలో ఉండే జిల్లా బీసీ సంక్షేమ అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొండనాగులలో జరిగిన అక్రమాలపై ఏసీబీ కేసు నమోదు చేసిందని, కానీ కొంత మంది అవినీతి రాష్ట్ర స్థాయి అధికారుల వల్ల బీసీ సంక్షేమ అధికారిగా బీరం సుబ్బారెడ్డి అక్రమంగా జిల్లా పదవి పొందారని ఆయన ఆరోపించారు. అంతే కాకుండా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.50వేలు లంచం తీసుకొని నియమించినట్టు ఆయన ఆరోపించారు.

## ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



కోదాడ, ఫిబ్రవరి 26 ( నినాదం న్యూస్): మహాశివరాత్రి వేడుకలను బుధవారం అనంతగిరి మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. అనంతగిరి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి చన్నుపల్లి - వల్లపురం- జక్కేపల్లి లోని కొలువైన బాల కోటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం వెంకటరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు నాయక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి , చుండూరి వెంకటేశ్వర్లు , దేగ కొండయ్య,మందడి రంగారెడ్డి, కుమ్మరి గురవయ్య, షేక్ దస్తగిరి , కంటూ వేణు, హాటియా నాయక్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

### - రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసరి సూర్య



ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా తాడ్వాయి మండలం పంబాపూర్, లింగాల గ్రామాల్లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని గుర్తించేలా క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అరేం లచ్చుపటేల్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఎండి ముజఫర్, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాలి కన్నయ్య , లింగాల మాజీ ఎంపిటీసి ఊకె పోతురాజు, మాజీ సర్పంచులు ఇర్ప సునీల్ దొర, కల్తీ నారాయణ, ఊకె మౌనిక నాగేశ్వరరావు, పోలెబోయిన కృష్ణ మంకిడి నరసింహ స్వామీ, ఎల్లబోయిన జానకి రాంబాబు, సీనియర్ నాయకులు మూతి రామస్వామి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, ఊకె కృష్ణ, ఊకె నాగేష్, చెన్నూరు సతీష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోడి సతీష్ కుమార్ , శనిగరపు చిరంజీవి, మద్రి నరేష్ , కుమార్, అరేం వెంకటేష్, చిరంజీవి, మోటం లక్ష్మయ్య, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## కాళేశ్వర సన్నిధిలో ప్రముఖులు



మహాదేవపూర్ ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకం, అమ్మవారి ఆలయంలో అర్చన కార్యక్రమాలు చేశారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కుటుంబసమేతంగా కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి అఖిల- కిరణ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ పూజారులు స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు ఈ సందర్భంగా ప్రముఖులకు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు.స్థానిక నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల పక్షాన నిలబడతాం

### -ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది



వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) : నిరంతరం పేద విద్యార్థుల పక్షాన, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను ఐక్యం చేసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.మల్లేష్ ఎం.ఆది అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రెండవ మహాసభలు బుధవారంతో ముగిశాయి. ఈ మహాసభల్లో 8 తీర్మానాలను ఆమోదించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని 11 మంది నాయకులతో ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మరోసారి ఎం.ఆదిని ఎన్నుకోవడంతోపాటు అధ్యక్షుడిగా బి.మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా రాఘవ, సహాయ కార్యదర్శిగా ఎం. రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులుగా ఆంజనేయులు, వీరన్న నాయక్, మోహన్, రాజవర్ధన్, మల్లీశ్వరి, రమేష్, కార్తీక్ గౌడ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో బలమైన విద్యార్థి సంఘంగా విద్యార్థి ఉద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలని, పెంచిన మెస్ చార్జీలు అమలు చేయాలని, యుజిసి గైడ్లెన్స్ ముసాయిదా నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, మహిళలకు, అమ్మాయిలకు రక్షణ చట్టాలు అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

## అపర భద్రాద్రిలో ఘనంగా శివపార్వతుల కళ్యాణం



**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో గల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అనుబంధ ఆలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఉదయం ఐదు గంటల నుండి భక్తులు భారీగా తరలివచ్చి ఆలయంలో గల రామలింగేశ్వర స్వామి శివలింగానికి ప్రత్యేక పూజలను అర్చనలను నిర్వహించారు. రామలింగేశ్వర స్వామిని అరణ్యవాస సమయంలో స్వయంగా శ్రీ శ్రీ రామచంద్ర మూర్తి పూజించినట్లు రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివలింగమును స్వచ్ఛమైన ఆవుపాలతో అభిషేకిస్తే శివలింగం నీలిరంగులోకి మారుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ పూజారులు నవీన శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య మేళా తాళాల మధ్య కళ్యాణం జరుగుతుండగా వందలాదిమంది శివ భక్తుల శివనామ స్మరణ మధ్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి లింగోద్భవ కాలాన్ని ఆలయ పూజారులు కనుల పండుగ నిర్వహించారు.

## శివనామ స్మరణతో మారు మోగిన శైవ క్షేత్రాలు

### -మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి



**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు శివాలయాల్లో బారులు తీరి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు చేశారు. జమ్మికుంట పట్టణంలోని బొమ్మల గుడిలో ఉదయం నుండే భక్తులు భారీగా తరలివచ్చి ఆ పరమేశ్వరుడి ఆశీస్సులు పొంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో పురాతన చరిత్ర కలిగిన ఆబాది జమ్మికుంట లోని శ్రీ మహాదేవ లింగేశ్వర ఆలయంలో భక్తులు భారీ ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో శివనామస్మరణతో మార్మోగాయి. జమ్మికుంట శివాలయంలో అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం చేసుకొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## కాంగ్రెస్ కార్యకర్త పాడే మోసిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజన్న స్వామిని దర్శనం చేసుకున్న అనంతరం వీణవంక మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త పార్టీ కోసం కృషి చేసిన ఎల్బాక గ్రామానికి చెందినవీరయ్య గౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకొని ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించి పాడే మోసిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్.వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని వీరయ్య గౌడ్ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ వీరయ్య పార్థవ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చి పాడమోసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ కోసం కష్టపడ్డ ఒక కార్యకర్త కోసం మహాశివరాత్రి పర్వదినాన తన కార్యక్రమాలను పక్కనపెట్టి వారి కుటుంబ సభ్యుల కు ప్రగాఢ సానుభూతి తెలిపి పాడే మూసి పలువురికి ఆదర్శంగా నిలిచిన బల్మూరి వెంకట్.

## నేడే ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్

### -ఎన్నికల కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

### -అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు



**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండల కేంద్రాలలో నేడు జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తో పాటు వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ మెదక్ నిజాంబాద్ అదిలాబాద్ జిల్లాలకు సంబంధించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకోవడంతోపాటు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకోగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను తాసిల్దారులతోపాటు ఎంపీడీవోలు పరిశీలిస్తున్నారు. పట్టబద్రులు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎప్పటికప్పుడు అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తారని సమస్యలు ఏమైనా ఉంటే అధికరణ దృష్టికి తీసుకురావాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.


## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ



**జమ్మికుంట ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్ర సాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అయితు రమేష్, గుడివాడ వెంకట సతీష్ లు మాట్లాడుతూ, మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని చాలామంది భక్తులు ఉపవాసం ఉంటారని తెలిపారు. వారికి స్వామి వారికి ఇష్టమైన కందగడ్డల ను భక్తులకు ప్రసాదంగా అందించడం జరిగిందని వారు తెలిపారు. వాసవి క్లబ్లో ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి రేణిగుంట రాజు నాయకులు శ్రీనివాస్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వేలాల మల్లికార్జున స్వామిని
# సందర్శించిన రామగుండం సీపీ..!

**గోదావరిఖని ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :** రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపీఎస్.,(ఐజి) జైపూర్ మండలం వేలాల మల్లికార్జున స్వామి ని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఐపిఎస్., లతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.మహాశివరాత్రి సందర్భంగా వేలాల జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖ ల సమన్వయం తో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జాతరకి వచ్చిన భక్తులు వంట వండుకోవడానికి వెలిగించిన పొయ్యిలు వంట అయిపోగానే వెంటనే ఆర్పీ వేయాలి. అదేవిదంగా బోనాలు వండి దీపాలు పెట్టడం జరుగుతుంది చుట్టూ ఎండిన గడ్డి ఎండిన ఆకులు ఉన్నాయి కావున అనుకోని ప్రమాదం జరిగే అవకాశం ఉంది గనుక జాగారం



ఉండేవారు తప్పకుండా తెలివితో ఉండి దీపాలను గమనిస్తూ ఉండాలని, ఈ విషయం లో ప్రజలు కూడా సహకరించాలని సిపి భక్తులకు ప్రజలకు సూచించారు. ఆలయంలో దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా బారీకేడ్లు ఏర్పాటు చేసి వరుస పద్ధతిలో అనుమతించడం జరుగుతుందని, దర్శనం కి వచ్చి వెళ్లే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, ప్రజలు, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవుని శీఘ్ర దర్శనం జరిగింది అని ఒక మంచి అనుభూతి తో ఆనందం గా వెళ్లే లాగా చూడాలి అని అధికారులకు సూచించారు. వాహన రాకపోకలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ నిర్వహించడం జరిగింది అని తిరిగి వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కాకుండా చూడాలని అధికారులకు సూచించారు అన్నారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏ ఆర్ ఏసీపీ ప్రతాప్, సీఐ శ్రీరాంపూర్ వేణు చందర్, ఆర్ ఐ సంపత్, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## హరినామ స్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు

- కోటిలింగాలకు పోటెత్తిన భక్తులు



**వెల్గటూర్, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మండలంలో శైవ క్షేత్రాలన్నీ హరనామ స్మరణతో మార్మోగాయి.మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటిలింగాలు కోటేశ్వర స్వామి ఆలయానికి బుధవారం వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు.వేకువ జాము నుండి గోదావరి నది తీరాన పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు,సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు.చలువ పందిళ్లు ఏర్పాటు చేసి,మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు,బాత్ రూం కు ఏర్పాటు చేశారు.వేకువ జామునే నాలుగు గంటలకు ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.లక్ష్మణ్ కుమార్ కు ఆలయ అధికారు లు అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.మహాశివరాత్రి పర్వదినాన ప్రతిసారి కోటిలింగాలకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులతో సతమతమయ్యేవారు.దీనిని దృష్టిలో ఉంచుకొని ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక ఆదేశాలనుసారం సిఐ రామ్ నర్సింహ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉమా సాగర్, పలువురు ఎస్ఐలు,సుమారు 30 మంది పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణకై పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.మోటార్ వాహనాలు,కార్లు,ఆటో ల పార్కింగ్ ల కోసం వేటి స్థానాలు వాటి కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.అడుగడుగునా పోలీసుల నియంత్రణతో వాహనదారులు కూడా పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలబడంతో,ఈ ఏడు పార్కింగ్ ట్రాఫిక్ సమస్య నుండి భక్తులకు ఎంతో ఉపశమనం కలిగింది.ట్రాఫిక్ నియంత్రణకై పోలీస్ శాఖ పటిష్ట చర్యల పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కోటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ధర్మపురి సిఐ రాం నర్సింహ రెడ్డి,వెల్గటూర్ ఎస్సై ఉనసాగర్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

## నల్లగోని వీరయ్య గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు

**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :** నిఖార్సైన కాంగ్రెస్ నాయకున్ని కోల్పోవడం భాద కలిగించదని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగొని వీరయ్య గౌడ్ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.వీరయ్య కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారనీ,వారి సేవలు మరువలేనివని,భవిష్యత్ లో పార్టీ తరపున వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ



కార్యక్రమంలో వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎల్బాక గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం కొత్తూరు మల్లయ్య అధ్యక్షతన, బుధవారం రోజున హుజురాబాద్ మండల కేంద్రంలోని సిఐటియు హమాలి సంఘం కార్యాలయంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ, పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించకుంటే దశలవారీగా ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం, ఒకటవ తేదీ నుండి పదవ తేదీలు నేరుగా గ్రామపంచాయతీ కార్మికులకు వారి అకౌంట్లో జీతాలు చెల్లించాలని, ఇప్పటికీ నవంబర్ నుండి జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలలో రెండు నుంచి ఐదు నెలల వరకు వేతనాలు పెండింగ్ ఉన్నాయని, వివిధ మండలాల నుండి హాజరై పాల్గొన్న మండల నాయకులు తెలిపారని, కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా, పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత ఫర్మెంటు, కనీస వేతనం చెల్లించాలని, సంవత్సర కాలం దాటుతున్న, పంచాయతీ కార్మికుల సమస్య ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని, ప్రభుత్వం వచ్చిన నుండి అనేక మార్లు మంత్రి గారికి కమిషనర్ గార్లకి ముఖ్యమంత్రి దృష్టి కూడా పంచాయతీ కార్మికుల సమస్యలు తీసుకువెళ్లినప్పటికీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు ప్రెస్ మీట్ లు పెట్టి పత్రికల ప్రకటన వరకే పరిమితం అవుతున్నారు తప్పితే, ఒక్క పైసా కూడా భారం పడని మల్టీ పర్పస్ విధానాన్ని ఇప్పటివరకు కూడా రద్దు చేయలేదని, లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి




క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బంది తక్కువ వేతనాలు కూడా ఇచ్చేందుకు నెలనెలా చెల్లించకుండా పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మార్చి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా, కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించే విధంగా చొరవ చూపాలని, లేనట్లయితే పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఐక్యమై పోరాటానికి సిద్ధమవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, ఎండీగా రవీందర్రావు, ఎలుక పెల్లి సారయ్య, మహంకాళి కొమురయ్య, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, మొలుగూరి ప్రేమ్ కుమార్, గంధసిరి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పరమశివుడి ఆశీస్సులతో
## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలోని విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి.మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలోని విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పరమశివుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ పట్టణ అధ్యక్షులు రాజు, బిజెపి జిల్లా నాయకులు పట్టణ నాయకులు పాల్గొని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జమ్మికుంట శివాలయం అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు అంజిరెడ్డిని సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ



రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో అన్ని వర్గాల వ్యాపారస్తులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శివుని కోరినట్లు అంజిరెడ్డి అన్నారు.

## అంగరంగ వైభవంగా
## ఎన్నారై వివాహ రిసెప్షన్

### -రిసెప్షన్‌కు హాజరైన ప్రముఖులు



**జమ్మికుంట, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్) :** హుజురాబాద్ పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ పోతిరెడ్డి రాహుల్ వివాహ రిసెప్షన్ హైదరాబాదు బాచుపల్లి లోని కే జీ ఆర్ కన్వెన్షన్ లో మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. రాహుల్ అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా స్థిరపడ్డారు. రాహుల్ తండ్రి పోతిరెడ్డి శ్రీనివాస్ హుజురాబాద్ పట్టణానికి చెందిన పూర్వ విద్యార్థి కావడంతో పాటు, హైదరాబాదు పటాన్చెరు లోని ప్రఖ్యాత తోషిబా టీ అండ్ డి సిస్టమ్స్ కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ గా పనిచేస్తున్నారు. పోతిరెడ్డి శ్రీనివాస్ మిత్రులైన 1981-1982 హుజురాబాద్ శిశు మందిర్ ఏడవ తరగతి బ్యాచ్, 1982-1985 ప్రభుత్వ హైస్కూల్, 1985-88 హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ బ్యాచ్, 1988-92 వరంగల్ కిట్స్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థులు వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సమావేశం లా వివాహ రిసెప్షన్ తలపించింది. హుజురాబాద్ హనుమకొండ, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాల నుండి శ్రీనివాస్ మిత్రులు శ్రేయోభిలాషులు రిసెప్షన్కు హాజరయ్యారు. వధూవరులు రాహుల్ రోహిణి దంపతులను అభినందించి ఆశీర్వదించారు. పోతిరెడ్డి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు పలువురు తోషిబా కంపెనీ ప్రతినిధులు జపాన్ నుండి ప్రత్యేకంగా హాజరై రిసెప్షన్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఫిన్లాండ్ నుండి వచ్చిన యువజంట అందరిని ఆకట్టుకున్నారు. పలువురు విదేశీయులు, పలు అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు కూడా రిసెప్షన్కు హాజరయ్యారు. రిసెప్షన్లో పూర్వ విద్యార్థుల సందడి కనిపించింది. చాలా రోజుల తర్వాత కలుసుకున్న మిత్రులు ఫోటోలు సెల్ఫీలు తీసుకొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. వివాహ రిసెప్షన్ లో ఐఏఎస్ అధికారి కోరెం అశోక్ రెడ్డి, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, వరంగల్ కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె అశోక్ రెడ్డి, హైదరాబాద్ పోస్టల్ శాఖ ఉన్నతాధికారి అక్కు శ్రీనివాస్, ఇన్ఫార్ సాఫ్ట్వేర్ కంపెనీ సీఈవో గంగిశెట్టి రాఘవేందర్, రిటైర్డ్ డిప్యూటీ డిఇఓ ఆలేటి మదన్మోహన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## గెలుపునకు చేరువలో స్వతంత్ర
## అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు



**కరీంనగర్, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్ ):** పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రచారంలో ముందు ఉంటూ తనకి జరిగిన యాక్సిడెంట్ ని కూడా లెక్కచేయకుండా సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరిని కలుసుకుంటూ సమాజం పట్ల పట్టభద్రుల పట్ల వారి సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా వారి సమస్యల పై పోరాడే వ్యక్తిగా ఆదరణ పొందుతున్నారు మేజర్ యాక్సిడెంట్ అయిన ఆ దేవుని ఆశీర్వాదం పట్టభద్రులకు సేవ చేయాలని మంచి ఉద్దేశంతో వీల్ చైర్ లో ఉండి కూడా పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. బిజినెస్ మ్యాన్ కు సర్వీస్ మ్యానుకు జరుగుతున్న ఈ ఎలక్షన్లో విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. పట్టబద్రులు తన వెంటే ఉన్నారని అన్నారు తన గెలిచిన తర్వాత వచ్చే 72 నెలల జీతం మొత్తాన్ని పట్టభద్రుల అభివృద్ధికై రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పట్టభద్రుల అభివృద్ధికి ఖర్చు చేస్తానన్నారు.

## భక్తులకు పండ్లు పంపిణీ చేసిన
## యువ నేతాజీ ఫౌండేషన్

**వరంగల్ ఫిబ్రవరి26 (నినాదం న్యూస్ ) :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వరంగల్ యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ స్టేషన్ రోడ్డులో ఉన్న ఆకారపు గుడిలో భక్తులకు పండ్లను పంపిణీ చేశారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయంనకు వచ్చిన సుమారు1000 మంది శివ భక్తులకు అరటి పండ్లు, అంగూర, ఖర్జూర, చెర్రీస్, సంత్రాలు 5 రకాల పండ్లును పంపిణీ చేయడం జరిగిందని నిర్వహక కమిటి తెలిపింది. బీజేపీ నాయకులు గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, ఇంతేజర్గంజ్ సీ.ఐ యం.ఏ షకూర్, వరంగల్ ట్రాఫిక్ సీ.ఐ రామకృష్ణ, ఆకారపు గుడిచెన్నూరు పాల్గొన్నారు.





# కాళేశ్వర క్షేత్రం.. భక్తజన సంద్రం..

- మార్మోగిన శివ నామస్మరణ
- గోదావరినదికి పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసి పోయిన శివాలయాలు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/మహాదేవపూర్ ఫిబ్రవరి 26, (నినాదం న్యూస్):** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వర క్షేత్రం భక్త జనసంద్రంగా మారింది. ఉదయం నుండి రాష్ట్ర నలుమూలల నుండే కాక మహారాష్ట్ర, చత్తీస్గడ్, రాష్ట్రాల నుండి అనేక మంది భక్తులు కాళేశ్వరం చేరుకొని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించడంతో గోదావరినది భక్తులతో పోటెత్తింది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు దీపాలు వెలిగిస్తూ జ్యోతులను నదిమాతకు వదిలారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకాలు, శుభానంద్ దేవి అమ్మవారి ఆలయంలో అర్చనలు నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఓం నమశ్శివాయ అంటూ శివ నామ స్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. మహాశివరాత్రి పర్వదినాన ఉపవాస దీక్షలతో భక్తులు కాళేశ్వర క్షేత్రంలో భక్తి వారవశ్యాన్ని ఉప్పొంగించారు.

**కన్నుల పండువగా కళ్యాణ వైభోగం...**

మహాశివరాత్రి పర్వదినాన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ముక్తీశ్వర శుభానంద దేవిలా కళ్యాణం సాయంత్రం 4:35 నిమిషాలకు అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు స్వామి వార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పూజారులు ఫణీంద్ర శర్మ, కృష్ణమూర్తి శర్మ ముక్తీశ్వర శుభానంద దేవి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు పునీతులయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో దేవస్థానం ఈవో మహేష్, సూపరిండెంట్ శ్రీనివాస్, తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**మార్మోగిన శివనామస్మరణ...**

మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కాళేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రిసందర్భంగా మూడు రోజుల పాటు జాతరను నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అయితే కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంతో పాటు సమీపంలోని మరికొన్ని ఆలయాలను భక్తులు దర్శించుకుంటారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి కావడంతో శివ నామస్మరణతో ఆలయాలు మ్రోగిపోయాయి.

**బారీ బందోబస్తు ఏర్పాట్లు...**

మహాశివరాత్రి సందర్బంగా కాళేశ్వర క్షేత్రంలో మూడు రోజుల జాతర సందర్బంగా పోలీసులు బారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడురోజుల పాటు జరిగే ఈ జాతరకు మన రాష్ట్రంతో పాటు పక్కరాష్ట్రాలు, జిల్లాల నుంచి బారీగా భక్తులు తరలివస్తారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. గోదావరినది తీరంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. అలాగే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాహనాలకు పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నిరంతర నిఘా నీడలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టారు. దేవస్థానం ఈవో మహేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



## ఉదయాన్నే నిమ్మరసం తాగితే.. ఆరోగ్యానికి ఎంతో మంచిది



చాలామందికి ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే మంచి ఆరోగ్యకరమైన అలవాటు. నిమ్మరసం నీటిని అనేక రకాలుగా తీసుకుంటారు. ఉదయాన్నే తేనెను కలిపి తాగడం కొందరికి అలవాటు. అలాగే, వేసవి కాలంలో ఒంటిని చల్లబరిచేందుకు పంచదార కలిపి తాగుతారు. మరింత తాజాదనాన్ని అందించేందుకు పుదీనా ఆకులను కలిపి తీసుకునే వారు కూడా ఉంటారు. నిమ్మరసం నీటిలో విటమిన్ యాంటీఆక్సిడెంట్లు, కాల్షియం, ఫోలేట్, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అయితే, ఉదయాన్నే దీనిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుందాం. నిమ్మకాయ నీరు అనేక పోషకాలతో నిండిఉంటుంది. అయితే దీన్ని అధికంగా తీసుకుంటే ఇందులో ఉండే సిట్రిక్ యాసిడ్ పళ్ల ఎనామిల్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందువల్ల, నిమ్మకాయ నీరు తాగిన వెంటనే నోటిని శుభ్రం చేసుకోవడం మంచిది. నిమ్మకాయ నీరు అనేక పోషకాలతో నిండిఉంటుంది. అయితే దీన్ని అధికంగా తీసుకుంటే ఇందులో ఉండే సిట్రిక్ యాసిడ్ పళ్ల ఎనామిల్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉంది. అందువల్ల, నిమ్మకాయ నీరు తాగిన వెంటనే నోటిని శుభ్రం చేసుకోవడం మంచిది. రోజూ నిమ్మకాయ నీరు తాగటం వల్ల ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. శరీరానికి తగినంత తేమను అందిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. విటమిన్ సమృద్ధిగా ఉండటం వల్ల శరీరాన్ని అనారోగ్యాల నుంచి కాపాడుతుంది. నిమ్మకాయ నీరు తరచూ తీసుకోవటం వల్ల జీర్ణక్రియకు మేలు చేస్తుంది. అజీర్ణ సమస్యలను తగ్గించి, జీర్ణ రసాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. స్థాయిలను సమతుల్యం చేస్తుంది. నిమ్మరసం ఆమ్లభావం కలిగి ఉన్నప్పటికీ, శరీరంలో ఆల్కలైన్ ప్రభావాన్ని కలిగించి సమతుల్యతను కాపాడుతుంది. అంతేకాదు.. నిమ్మకాయ నీరు బరువును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరిచి, ఎక్కువసేప కడుపు నిండుగా ఉన్న భావాన్ని కలిగించడంతో ఆకలిని అదుపులో ఉంచుతుంది. శ్వాసను తాజాగా ఉంచుతుంది. నోటిలో దుర్వాసన సమస్యలను సహజసిద్ధంగా నివారిస్తుంది. నిమ్మకాయ నీరు చర్మ ఆరోగ్యానికి కూడా తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని స్వచ్ఛంగా, ప్రకాశవంతంగా ఉంచుతాయి. కాలేయాన్ని డిటాక్స్ చేయడంలో సహాయపడుతుంది. నిమ్మకాయ నీరు కాలేయాన్ని శుభ్రపరిచేందుకు ఉపయోగపడుతుంది.




# NINADAM MARKET

## మీరు హోమ్ లోన్ తీసుకుంటున్నారా
# తక్కువ వడ్డీకి రుణాలు

మీరు గృహ రుణం తీసుకోవాలని ప్లాన్ చేస్తుంటే మీకు మంచి అవకాశం ఉంది. అనేక బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తున్నాయి. వీటిలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ ఉన్నాయి. ఈ బ్యాంకులు కంటే చౌకైన గృహ రుణాలను అందిస్తున్నాయి.. మీరు లోన్ మీద ఇల్లు కొనాలని ప్లాన్ చేస్తుంటే మీకో శుభవార్త ఉంది. దేశంలోని 5 నుండి 6 ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే చౌకగా గృహ రుణాలు ఇస్తున్నాయి. చౌకగా ఇల్లు కొనడానికి మీకు మంచి అవకాశం ఉంది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 0.25 శాతం తగ్గించిన తర్వాత ఈ బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించాయి. ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గృహ రుణాలపై ఫ్లోటింగ్ రేటును 0.25 శాతం తగ్గించింది. ఇప్పుడు 8.25 శాతం వడ్డీకి గృహ రుణం ఇస్తోంది. ఎస్‌బీఐ ఈ ఫ్లోటింగ్ రేటు ప్రైవేట్ రంగ హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రారంభ రేట్ల కంటే చౌకైనది. అదే సమయంలో ప్రైవేట్ రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ 8.75 శాతం వడ్డీ రేటుకు గృహ రుణాలను అందిస్తున్నాయి. స్టేట్ బ్యాంక్ కంటే తక్కువ ధరలకు గృహ రుణాలు అందిస్తున్న బ్యాంకులు చాలా ఉన్నాయి. బ్యాంకుల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. ఫిబ్రవరి 2025 నాటికి ఎస్‌బీఐ కంటే తక్కువ ధరలకు గృహ రుణాలను అందిస్తున్న బ్యాంకులు కనీసం 6 ఉన్నాయి. ఈ బ్యాంకులలో ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఉంది. ఈ బ్యాంకు 8.1 శాతం వార్షిక వడ్డీ రేటుకు గృహ రుణం అందిస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి 20 సంవత్సరాలకు రూ.50 లక్షల గృహ రుణం తీసుకుంటే, నెలవారీ ఈఎంఐ రూ.42,133 అవుతుంది. అదేవిధంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 8.1 శాతం వార్షిక వడ్డీ రేటుకు గృహ రుణాలను అందిస్తోంది. ఇది కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ కూడా 8.15 శాతం వడ్డీ రేటుకు గృహ రుణాలు ఇస్తున్నాయి. అంటే మీరు 20 సంవత్సరాలకు రూ.50 లక్షల గృహ రుణం తీసుకుంటే, నెలవారీ ఈఎంఐ రూ.42,289 అవుతుంది.

**ప్రైవేట్ బ్యాంకుల రేటు ఎంత?**

అదే సమయంలో ప్రైవేట్ రంగంలోని బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బ్యాంక్ 8.75 శాతం వడ్డీ రేటుకు గృహ రుణాలను అందిస్తున్నాయి. ఈ రేటు ప్రకారం, మీరు 20 సంవత్సరాలకు రూ.50 లక్షల రుణం తీసుకుంటే నెలవారీ ఈఎంఐ రూ.44,185 అవుతుంది. బ్యాంక్ అందించే తుది గృహ రుణ రేటు కస్టమర్ క్రెడిట్ స్కోర్‌ను బట్టి మారుతుందని గుర్తించుకోండి.



# నెలకు రూ.250 పెట్టుబడితో లక్షల్లో రాబడి..
## ఆ ఎస్‌బీఐ స్కీమ్ గురించి తెలుసా

భారతదేశంలో ఇటీవల కాలంలో పెట్టుబడిదారుల ఆలోచనా విధానాలు మారాయి. స్థిర ఆదాయ పథకాల కంటే రిస్క్ ఎక్కువైనా పర్లేదని మ్యూచువల్ ఫండ్స్ వంటి మార్కెట్ రిస్క్ ఉన్న పథకాల్లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ ఓ కొత్త మ్యూచువల్ ఫండ్‌ను ప్రకటించింది. ఎస్‌బీఐ జననివేష్ పేరుతో ప్రకటించిన ఈ ఫండ్‌లో నెలకు రూ.250 స్వల్ప పెట్టుబడితో లక్షల్లో రాబడి పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఇటీవల జననివేష ఎస్ఐపీను ప్రారంభించింది, ఈ ఎస్ఐపీల్లో కేవలం నెలకు రూ.250 పెట్టుబడితో పెట్టుబడి ప్రయాణం ప్రారంభించవచ్చు. గ్రామీణ, సెమీ-అర్బన్, పట్టణ ప్రాంతాల నుంచి చిన్న మొత్తాలతో పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ఈ స్కీమ్‌ను లాంచ్ చేశారని నిపుణులు చెబుతున్నారు. ఎస్ఐపీలో ముఖ్యమైన విషయం స్థిరత్వం. మీ పెట్టుబడి మొత్తం చిన్నదా కాదా అనేది పట్టింపు లేదు, కానీ మీరు పెట్టుబడి పెడుతూనే ఉన్నంత వరకు మీ కార్పస్ పెరుగుతుంది. అలాగే భవిష్యత్‌లో అనేక రెట్లు రాబడిని ఇవ్వగలదు. కాబట్టి పెట్టుబడిదారులు జననివేష్ కింద నెస్‌బీఐ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఇది హైబ్రిడ్ డైనమిక్ ఆస్తి కేటాయింపు పథకంగా ఉంది. రిస్క్‌ను నిర్వహిస్తూనే రాబడిని ఆప్టిమైజ్ చేయడానికి ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పెట్టుబడి పెడుతుంది. ప్యూర్ ఈక్విటీ లేదా డెట్ ఫండ్ల మాదిరిగా కాకుండా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ మార్కెట్



తిరోగమనాల సమయంలో స్థిరత్వాన్ని అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎస్‌బీఐ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌లో జననివేష్ కింద ఎస్ఐఈపీ ద్వారా ప్రతి నెలా రూ. 250 స్థిరంగా మరియు శ్రద్ధగా పెట్టుబడి పెడితే మీ కార్పస్ 40 సంవత్సరాల తర్వాత సంవత్సరానికి 12 శాతం రాబడితో సుమారు రూ. 29,70,605 లక్షలు అవుతుంది. తద్వారా మొత్తం రూ.1,20,000 పెట్టుబడితో 40 సంవత్సరాలలో రూ.28,50,605 లాభం వస్తుంది. ఎస్‌బీఐ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ మొత్తం ఏయూఎం జనవరి 31, 2025 నాటికి రూ. 33305.48 కోట్లుగా ఉంటే ప్రస్తుత ఎన్ఏవీ రూ. 14.40గా ఉంది.

# ప్యూర్ ఈవీ వినియోగదారులకు గుడ్‌న్యూస్..



పర్యావరణహిత మొబిలిటీ లక్ష్య సాధనకు దోహదపడుతూనే రిఫరల్స్ ఇవ్వడం ద్వారా ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్ ఇన్సెంటివ్‌లతో ప్రయోజనం కూడా పొందవచ్చని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా ఈవీల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించగలదని ఆశిస్తున్నామని అన్నారు.. భారతదేశపు ఎలక్ట్రిక ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజాల్లో ఒకటైన ప్యూర్ ఈవీ..తమ విలువైన కస్టమర్ల కోసం గొప్ప ఆఫర్‌తో ముందుకు వచ్చింది. 'ప్యూర్ పర్ఫెక్ట్ 10' అనే రిఫరల్ ప్రోగ్రాంను ఆవిష్కరించింది. ఇందులో వినియోగదారులను ఆకట్టుకునే క్యాష్‌బ్యాక్ ఆఫర్లు కూడా ఉన్నాయి. శివరాత్రి, హోలీ, ఉగాది, రంజాన్ సహా పండుగల సీజన్ నేపథ్యంలో వినియోగదారులకు మరింత చేరవయ్యేందుకు దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ ఆఫర్ ఎంతగానో దోహదపడనుంది.

**ఆఫర్ మార్చి 31 వరకు అందుబాటులో..**

ఈ ప్యూర్ పర్ఫెక్ట్ 10 రిఫరల్ ప్రోగ్రాం అనేది ప్రస్తుత ప్యూర్ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారులందరికీ, 2025 మార్చి 31లోగా ప్యూర్ ఈవీ వాహనాన్ని కొనుగోలు చేసే కొత్త కస్టమర్లకు వర్తించనుంది. అలాగే ఆయా ఔట్‌లెట్స్‌లో స్టాక్స్ ఉండేంతవరకు కూడా ఆఫర్ వర్తించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ స్కీము కింద ప్యూర్ ఈవీ స్కూటర్‌ను కొనుగోలు చేసేలా తమ స్నేహితులు, కుటుంబ సభ్యులను రిఫర్ చేసే కస్టమర్లు రూ. 40,000 వరకు క్యాష్‌బ్యాక్ రివార్డులు పొందవచ్చని కూడా వెల్లడించింది.

**రూ.4 వేల క్యాష్‌బ్యాక్ వోచర్లు:**

ప్రస్తుత, కొత్త ప్యూర్ ఈవీ వినియోగదారులకు వారి రిజిస్టర్డ్ వాట్సాప్ నంబరుపై 10 రిఫరల్ కోడ్‌లు వస్తాయి. రిఫర్ చేసిన వారు ప్యూర్ ఈవీ ని కొనుగోలు చేస్తే అలాంటి ప్రతి లావాదేవీకి గాను రిఫరర్‌కి రూ.4,000 క్యాష్‌బ్యాక్ వోచర్‌లు లభించనున్నాయి. అయితే ఒక్కో రిఫరర్ గరిష్టంగా పది మంది వరకు కొత్త కొనుగోలుదార్లకు ఇది వర్తిస్తుంది.

**ఈవీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు..**

పర్యావరణహిత మొబిలిటీ లక్ష్య సాధనకు దోహదపడుతూనే రిఫరల్స్ ఇవ్వడం ద్వారా ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్ ఇన్సెంటివ్‌లతో ప్రయోజనం కూడా పొందవచ్చని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా ఈవీల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించగలదని ఆశిస్తున్నామని అన్నారు.



# ఆ బిల్లులు కడితే చార్జీల బాదుడే..
## గూగుల్ పేలో కొత్త నిబంధనలు

ప్రజల జీవితాల్లో ఆధునిక టెక్నాలజీ అనేక మార్పులను తీసుకువచ్చింది. అన్ని పనులను సులువుగా చేసుకునే అవకాశం కలిగించింది. వాటిలో డిజిటల్ చెల్లింపులను ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఈ విధానంలో అన్ని ఆర్థిక లావాదేవీలను చాలా వేగంగా, సులభంగా జరుపుకోవచ్చు. విద్యుత్, గ్యాస్, ఫోన్ రీచార్జి.. ఇలా అనేక బిల్లులను సులభంగా చెల్లించవచ్చు. బిల్లుల చెల్లింపులకు అనుమతిచ్చే వివిధ యాప్ లలో గూగుల్ పే ఒకటి. మన దేశంలో దీని ద్వారా అనేక మంది ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. అయితే తన యూజర్లకు గూగుల్ పే షాక్ ఇచ్చింది. కార్డుల ద్వారా చెల్లించే బిల్లులపై చార్జీ వసూలు చేస్తోంది. ప్రస్తుతం కిరాణా షాపు నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ల వరకూ, రోడ్డు పక్కనే ఉన్న చిన్న పండ్ల బండి నుంచి విమానం టిక్కెట్ల వరకూ అన్నింటికి డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం ఉంది. స్మార్ట్ ఫోన్ లోని వివిధ చెల్లింపుల యాప్ ల ద్వారా యూపీఐ విధానంలో వీటిని జరుపుకోవచ్చు. గతంలో ఉచితంగా ఉండే ఈ సేవలు క్రమంగా చార్జీల రూపంలోకి మారుతున్నాయి. దీనిలో భాగంగానే గూగుల్ పే ద్వారా చెల్లిస్తున్న విద్యుత్, గ్యాస్, ఫోన్ రీచార్జులకు చార్జీ పడనుంది. అయితే ఇద్దరు వ్యక్తులు, దుకాణదారుడికి చేసే చెల్లింపులు మాత్రం ఉచితంగానే జరుగుతాయి. గూగుల్ పే తీసుకువచ్చిన కొత్త నిబంధనల ప్రకారం ఆ యాప్ లో డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి చేసిన బిల్లుల చెల్లింపులపై ఒక శాతం చార్జీని వసూలు చేస్తారు. ఉదాహరణకు మీరు నెలకు రూ.1500 విద్యుత్ బిల్లు కడుతూ ఉంటే, దానిపై ఒక శాతం అదనంగా వసూలు చేస్తారు. అయితే చెల్లింపుల చార్జీలను గూగుల్ పే మాత్రమే వసూలు చేయడం లేదు. ప్రముఖ చెల్లింపుల యాప్ అయిన పేటీఎం, ఫోన్ పే తదితర వాటిలోనూ అమలవుతున్నాయి. వినియోగదారుల సౌకర్యం కోసం గూగుల్ పే కొత్త ఫీచర్లను తీసుకురానుంది. రాబోయే రోజుల్లో ఇవి అందుబాటులోకి రానున్నట్టు సమాచారం. దాని ద్వారా మీ యూపీఐ ప్రాథమిక ఖాతాకు మీ తల్లిదండ్రులు, పెద్దలు, కుటుంబ సభ్యులను లింక్ చేయవచ్చు. తద్వారా వారు యూపీఐ ఖాతాను తయారు చేసుకోకుండానే చెల్లింపులు జరుపుకోవచ్చు. మన దేశంలో డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సామాన్యుల నుంచి సంపన్నుల వరకూ ఈ విధానాన్ని పాటిస్తున్నారు. సులభంగా చెల్లింపులు జరగడం, చిల్లర సమస్యలు లేకపోవడంతో అందరూ అలవాటు పడుతున్నారు. దేశంలో ప్రజలందరికీ స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి రావడం అత్యంత ముఖ్యమైన కారణం. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జేబులో డబ్బులను పెట్టుకునేవారు. ఇప్పుడు కేవలం స్మార్ట్ ఫోన్ ఉంటే సరిపోతుంది. దానిలోని యాప్ ల ద్వారా యూపీఐ విధానంలో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు జరుపుకోవచ్చు.

## నరేందర్ రెడ్డి గెలుపు ఖాయం

### -ధీమా వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**8 ఇంక్లైన్ కాలనీ, ఫిబ్రవరి 26, నినాదం న్యూస్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మరియు శాసనసభ వ్యవహా రాల మంత్రివర్యులు శ్రీధర్ బాబు బలపరిచిన అభ్యర్థి ఊటుకూరి నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అదేశాల మేరకు 8వ కాలనీలో ఎమ్మెల్సీ ఓటర్లందరినీ కలిసి ఓటు అభ్యర్థించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతి ఓటర్ కూడా సానుకూలంగా స్పందించి కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తామని కాలని ప్రజలనుండి మంచి స్పందన వస్తుంది.. అలాగే రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తామని రాజ్ ఠాకూర్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్షుడు మరీల్లి రాజిరెడ్డి, టౌన్ అధ్యక్షులు గుండెట్టి రాజేష్ , 18వ డివిజన్ అధ్యక్షులు మార్క రాజు,17వ డివిజన్ అధ్యక్షులు కిషన్ నాయక్, 16వ డివిజన్ అధ్యక్షులు ఆకుల రాజిరెడ్డి, అనుమ రాములు, 19వ డివిజన్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, సారయ్య నాయక్, కుమార్, అఖిల్, ప్రశాంత్, రాకేష్, అజయ్, అక్షయ్ , శ్రీనివాస్, సతీష్, శ్రీధర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పొట్యాలలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు..!



**గోదావరిఖని 26 (నినాదం న్యూస్) :** పొట్యాల గ్రామం నూతనంగా నిర్మించిన శ్రీ హరిహర శివాలయం లో ఘనంగా శివరాత్రి ఉత్స వాలు నిర్వహించారు. ఉద యం లక్ష బిలువ పత్ర అర్చన హెూమం నిర్వ హించి తరువాత శివ కళ్యాణం, రాత్రి అభిషేక కార్యక్రమలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం లో పల్లెర్ల కోటయ్య కాంతమ్మ,చంద్ర మౌళి వజ్రమ్మ, క్రిష్ణ దీపిక ప్రకాశ్, శ్రీనివాస్, రవిందర్,మాజీ సర్పంచ్ ఎదులాపురం నీరజ వెంకటేష్, మరియు గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహెూత్సవం

### -పాల్గొన్న ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ దంపతులు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మహా శివరాత్రి పండగను పురస్కరించుకొని సుల్తానా బాద్ మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో శివ పార్వతుల కళ్యాణం బుధ వారం ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ ఆధ్వ ర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో పూజారులు వడ్లకొండ మహేష్, వడ్ల కొండ రమేష్ వేద మంత్రోచ్చారణల మధ్య కళ్యా ణాన్ని జరిపించారు.ఈ సందర్భంగా శివాలయం లో ఉదయం నుండి అభిషేకములు, అర్చనలు చే పట్టారు. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సు లు పొందారు. మధ్యాహ్నం శివపార్వతుల కల్యా ణోత్సవంలో ఆలయ చైర్మన్ అల్లంకి భాగ్యలక్ష్మి సత్యనారాయణ,5వవార్డు మాజీ కౌన్సిలర్ పారు పల్లి జ్ఞానేశ్వరి గుణపతి దంపతుల తో తోపాటు డైరెక్టర్లు చేపూరి రవీందర్ గౌడ్,దూడం పద్మ లింగ మూర్తి, శ్రీలత దంపతులు పాల్గొని కళ్యా ణాన్ని తిలకించి పరమశించిపోయారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిల కించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంత రం మహిళ భక్తులుశివపార్వతులకుఒడిబియ్యం సమర్పించుకున్నారు.అలాగే శివాలయం ముందు కేశవరం సిమెంట్ బిర్లాశక్తి ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు,కామదేనువు సలాక ఆధ్వర్యం లో వాటర్ బాటిళ్లుఅందజేశారు.రాత్రి దీపారాధ న,అర్చనలు నిర్వహించి,స్వామివారి సేవ ఉత్స వమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

## వాసవీ వనిత క్వీన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

### -జిల్లా కేబినెట్ జాయింట్ సెక్రటరీ రమాదేవి




**సుల్తానాబాద్, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** డిస్ట్రిక్ట్ రీజియన్ 1, జోన్ 3 వాసవీ వని త క్వీన్స్ క్లబ్ మహా శివరాత్రి పండగను పురస్క రించుకుని సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పురాతన శివాలయం లో అభిషేకం చేసి, శివ పార్వతుల కళ్యాణం అనంతరం భక్తులకు పం డ్లను పంపించేశారు. ఈ కార్యక్ర మంలో డిస్ట్రిక్ట్ కేబినెట్ జాయింట్ సెక్రటరీ యంసాని రమాదేవి, బాదం వాణి, డిస్ట్రిక్ట చైర్ పర్సన్ జేశెట్టి సుమ, ఉపఅధ్యక్షురాలు చకిలం వర్షిణి, డైరెక్టర్ 1 అ యితు మానస, మాధవి,రూప, పల్లా లక్ష్మి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు .

## పోలింగ్ కేంద్రాల పరిశీలన




**మంథని ఫిబ్రవరి 26( నినాదం న్యూస్):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ముత్తారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో పోలింగ్ కేంద్రాలను ఎంపిడీఓ సురేష్,ఎస్సై గోపతి నరేష్,ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి,బుధవారం రోజున పరిశీలించారు.కరీంనగర్,నిజాంబాద్,అదిలాబాద్,మెదక్,ఉమ్మడి జిల్లాలోని శాసనమండలి ఉపాధ్యాయ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు.ఈ పోలింగ్ కేంద్రంలో 17 మంది ఉపాధ్యాయ ఓటర్లు,754 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు.పోలింగ్ ఉదయం8:00 గంటల నుండి సాయంత్రం 4:00గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడి మిట్ట శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు

### -నిర్వాహకులు రౌతు సూరి, ఆకుల రాములు

### -ఉపవాసం ఉండే భక్తులకు ఉచితంగా పండ్ల పంపిణీ



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** గుడి మిట్ట శివాలయంలో మహాశివరాత్రి వేడుక లు నిర్వాహకులు రౌతు సురేష్, ఆకుల రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.బుధవా రం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పురాతన గుడిమిట్ట శివాలయంలో మహాశివరాత్రి పండగ ను పురస్కరించుకొని ఉదయం నుండే స్వామివా రి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించి, స్వామివారి కృపను పొందారు. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించి, ఉచితంగా పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు గాజుల రాజమ ల్లు, ఆకుల రాములు, శ్రీనివాస్, సామాజిక కార్య కర్త తుమ్మ రాజ్ కుమార్ తోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలయాలలో మార్మోగిన శివనామస్మరణం





**మంథని ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** మంత్రపురిగా ప్రసిద్ధిగాంచిన మంథని పట్టణంలోని శివాలయాలు బుధవారం మహాశివరాత్రి పర్వదినం రోజున భక్తులతో కిటకిటలాడయి. పవిత్ర గోదావరి నది తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మొదట శ్రీ గౌతమేశ్వర స్వామి ని దర్శించుకుని పట్టణంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి, శ్రీ భిక్షేశ్వర స్వామి, శ్రీ శీలేశ్వర సిద్దేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటల నుండి భక్తుల సందర్శనతో ఆలయంలో పండుగ వాతావరణ నెలకొంది. మంథని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు భద్రతా చర్యలను చేపట్టారు. అలాగే శ్రీ సుధాబండేశ్వర స్వామి, శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకం చేసుకున్నారు. జూనియర్ కళాశాల వద్ద అనాదిగా కొలువుతీరిన రాజరాజేశ్వర స్వామి శివలింగం వద్ద, కొత్తగా వెలసిన భోయ లింగం వద్ద భక్తులు పూజ నిర్వహించారు. శివరాత్రి రోజున భక్తులు ఉపవాస ఉంటూ తెల్లవారు వరకు జాగరణ చేస్తుంటారు. సాయంత్రం శివ పార్వతుల కళ్యాణ మహెూత్సవానికి ఆలయాలను మామిడి తోరణాలతో అలంకరించి కళ్యాణ ఏర్పాట్లు చేశారు. అలాగే రాత్రి 12 గంటలకు శంకరునికి ఎంతో ప్రీతిపాత్రమైన నిషిదళ కార్యక్రమానికి భక్తులు అంతే సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందువల్ల ఆలయాల వద్ద భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు.

**మార్మోగిన శివనామ స్మరణం**



**మంచిర్యాల : (నినాదం న్యూస్):** జిల్లా కేంద్రంలోని గోదావరి నది ఒడ్డున నిర్మించిన మహా ప్రస్థానంలో బుధవారం శివుని విగ్రహానికి నిర్వహించిన రుద్రాభిషేకం లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దంపతులు పాల్గొన్నారు. మహా ప్రస్థానంలో పేదవారికి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే మహాప్రస్థానం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# భక్తులపై మంత్రికి చిత్తశుద్ధి లేదు

- కనీస సౌకర్యాలు కల్పించకపోవడం విడ్డూరమే
- భక్తుల మనోభావాలను గౌరవించకపోవడం బాధాకరం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** మంథని ప్రాంత ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే మహాశివరాత్రి పండుగ భక్తులపై మంథని ఎమ్మెల్యే, మంత్రికి చిత్తశుద్ధి లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మంథనిలో గోదావరనది తీరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగ రోజున ప్రతి ఒక్కరు గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి శైవక్షేత్రాలను దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోందన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఈనాడు మంథని గోదావరినదిలో చుక్క నీళ్లు లేకుండా చేశారని, కేవలం ఒక్క నీటి పాయ ఉంటే వేల సంఖ్యలో భక్తులు ఇబ్బందుల నడుమ స్నానాలు ఆచరిస్తున్నారని ఆయన వాపోయారు. కాంగ్రెస్ పార్టీ కావాలనే మేడిగడ్డ బరాజ్‌ను నిర్వీర్యం చేసి దానిపై ఏదో లబ్ది పొందాలని దుష్ప్రచారం చేసి 14 నెలలుగా నీళ్లు ఆపడం లేదన్నారు. మేడిగడ్డ బరాజ్‌లోని ఒక్క పిల్లర్ కుంగిపోవచ్చు కానీ పైన ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎలాంటి ఇబ్బందులు లేకున్నా నీళ్లు నిలుపాలనే ఆలోచన చేయలేదన్నారు. మంత్రిగా ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. కనీసం నీళ్లు నిలుపలేదని, సౌకర్యాలు కల్పించలేదన్నారు. నీళ్ల విషయంలో ఇటు వ్యవసాయ దారులను అటుప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.దేవుడిని దర్శించుకునే ముందు పుణ్యస్నానాలు ఆచరించడం సంప్రదాయంగా బావించే ప్రజల మనోభావాలకు కనీసం గౌరవం ఇవ్వడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, మంత్రి కళ్లు తెరిచి రాబోయే పండుగల వరకైనా మంథని గోదావరినదిలోకి నీళ్లు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం నిర్భయంగా ఓటేయండి




**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుల ఎన్నికలకు సర్వ సిద్ధం చేశామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వరకు జరుగుతుందని, ఇందు కొరకు ర్యాండమైజేషన్ లో కేటాయించిన ప్రకారంగా ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 60 మంది ప్రిసైడింగ్ అధికారులు, 181 మంది పోలింగ్ అధికారులు, 25 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజున పట్టభద్రుల ఎన్నికలో 19 వేల 41 మంది పురుషులు, 11 వేల 880 మంది మహిళలు, ఉపాధ్యాయుల ఎన్నికలో 999 మంది పురుషులు, 665 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎం.ఎల్.సి. ఎన్నిక కొరకు 18 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నిక కొరకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 8 కామన్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది తమ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దైవ దర్శనానికి వెళ్తూ...కానరాని లోకాలకు



**మహాదేవపూర్ ఫిబ్రవరి 26, ( నినాదం న్యూస్ ):** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన కాళేశ్వరం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జంగేడు గ్రామానికి చెందిన సమ్మెట సమ్మయ్య భాగ్య దంపతులు పండుగ సందర్బంగా కాళేశ్వర క్షేత్రానికి తమ ద్విచక్రవాహనంపై బయలు దేరారు. మహాదేవపూర్ కాళేశ్వరం అటవీ ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో సమ్మయ్య బార్య భాగ్య అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే మహాదేవపూర్ ఆస్పత్రికి తరలించగా ఆమె మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. సమ్మయ్యకు స్వల్ప గాయాలు కాగా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. కాగా మహశివరాత్రి పండుగ రోజున బాగ్య మృతితో ఆమె స్వగ్రామమైన జంగేడులో విషాదం నెలకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హత్య కేసులో నిందితుల అరెస్ట్




**భూపాలపల్లి, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** టేకుమట్ల మండలం గరిమిళ్ళపల్లి గ్రామానికి చెందిన సూరపాక వీరమ్మ (75) అనే మహిళను హత్య చేసిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి పట్టుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సీఐ మల్లేష్ తో కలిసి భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు మాట్లాడారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం వీరమ్మ ఈనెల 19న పరిసర గ్రామంలో చింతపండు అమ్ముతున్న క్రమంలో గ్రామానికి చెందిన బోయిని మల్లయ్య పుట్టకొక్కుల శ్రీనివాసు మద్దెల సిద్దూ అనే ముగ్గురు వ్యక్తులు వీరమ్మ ను చెట్ల చాటుకు తీసుకెళ్లి గొంతు నులిమి చంపారు.మృతదేహాన్ని గోనే సంచులో కుక్కి పసిక మనెమ్మ అనే రైతు వ్యవసాయ బావిలో పడ వేశారు. ఈనెల 23న బావి నుండి దుర్వాసన రాగా పోలీసులకు తెలుపగా మృతదేహాన్ని బయటకు తీశారు. బోయిని మల్లయ్య అనే నిందితుడి కూతురు అనారోగ్యానికి కారణం వీరమ్మ మంత్రాలు చేస్తుందని బంధువు పుట్టకొక్కుల శ్రీనివాస్ అనే మరో నిందితుడు తెలపగా నిందితులు ఆమెను హతమార్చినట్లు పోలీసులు తెలిపారు.మృతురాలకు చెందిన నిందితుల నుండి 2 తులాల బంగారం 30 తులాల వెండి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఇన్వెస్టిగేషన్ చేయడంలో చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ టేకుమట్ల మండల ఎస్సై ని డీఎస్పీ అభినందించారు. మూఢనమ్మకాల పేరుతో ఇలాంటి సంఘటన చేయడం చట్టరీత్యా నేరం అని అన్నారు అనారోగ్యానికి గురి అయితే వెంటనే ఆసుపత్రికి వెళ్లి మెరుగైన చికిత్స తీసుకోవాలని డీఎస్పీ సంపత్ రావు సూచించారు.

## ఖమ్మంపల్లిలో ఘనంగా పట్నాలు



**మంథని ఫిబ్రవరి 26( నినాదం న్యూస్):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి, మల్లికార్జున స్వామి ఆలయాల్లో పట్నాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డప్పుల చప్పులు, మంగళవాయి ద్యాల నడుమ ఈ పట్నాలు చేపట్టారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## పరమశివుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి


### -ఆలయ చైర్మన్ వేగోళం శంకర్ గౌడ్



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** పరమశివుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతో షాలతో సుభిక్షంగా ఉండాలని సుల్తానాబాద్ మం డల కేంద్రంలోని పూసాల శంభు లింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ వేగోళం శంకర్ గౌడ్ స్వామివారిని కోరారు. బుధవారం మహాశివరాత్రి పండగను పు రస్కరించుకొని పూసాలలో శంభు లింగేశ్వర స్వా మి దేవాలయం లో మహా శివరాత్రి వేడుకలను ఆలయ చైర్మన్ శంకర్ గౌడ్ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వ హించి, ప్రజలంతాసుభిక్షంగాఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ ,కమిటీ డైరెక్టర్ లు కనుకుంట్ల ప్రమీల శ్రీ నివాస్, పెగడ శ్యామ్, పిట్టల రమేష్, జూలూరి శ్రీ నివాస్, పురం దిలీప్ కుమార్, పురం హరికిషన్, బుర్ర సురేష్ గౌడ్,మేకల రాజయ్య, వేగోళం అనిల్ గౌడ్, గడ్డం అంజి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ ప్రెసిడెంట్ ఉస్తేం రవి, మాజీ ఎంపీ టీసీ కంకణాల ఆశాలు,వేగోళం సుమన్, గడ్డం శం కర్ గౌడ్,వేగోళం శ్రీనివాస్ గౌడ్,గడ్డం శంకర్,చొప్ప రి సది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండుగ పూట విషాదం

### స్నానానికి వెళ్లి గోదావరిలో గల్లంతు



**చెన్నూర్ ఫిబ్రవరి 26 (నినాదం న్యూస్):** శివరాత్రి పర్వదినం వేళ కోటపల్లి మండలంలోని పారుపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది కోటపల్లి మండలం లోని పారుపల్లి గ్రామానికి చెందిన రాదండి రాజేష్(50) బుధవారం ఉదయం ఎర్రాయిపేట్ వద్ద ఉన్న గోదావరి నదిలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కోటపల్లి పోలీసులు గజఈత గాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టారు పండుగ వేళ రాజేష్ గల్లంతు కావడంతో గోదావరి వద్ద బాధిత కుటుంబ సభ్యులు తరలి వచ్చారు

## వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 26(నినాదం న్యూస్):** మంచిర్యాల జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల్లో పరమశివుని కొలుస్తూ రుద్రాభిషేకాలు చేశారు.

# వంగర శివాలయంలో మంత్రి పూజలు

- వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా చూసుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి26 (నినాదం న్యూస్) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, పీవీ నరసింహారావు సోదరుడు మనోహర్ రావు మహా శివరాత్రి పర్వదినాన అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మంచి సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో రైతులు మొత్తం వ్యవస్థ అంతా సంతోషంగా ఉండలని ఆ దేవుడికి ప్రార్థించినట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నికల కోడ్ ఉంది అధికారులు బాధ్యత తీసుకొని వేసవిలో తాగు సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి వేసవి కాలంలో గ్రౌండ్ వాటర్



పడిపోయినప్పుడు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయి దానిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది ఇప్పటికే పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క ఎన్ని నిధులు అయినా ఇస్తామని చెప్పారు. గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి కోడ్ ఐపోగానే ప్రత్యక్షంగా గ్రామాలను సందర్శిస్తం గ్రామాల్లో తాగు సాగు నీటికి ఇబ్బంది వస్తె జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారుల దృష్టికి మా స్థానిక నాయకులు తీసుకోవాలి శివరాత్రి పుట అందరూ బాగుండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, మహిళా నాయకురాలు చీదురుల స్వరూప, వంగర కాంగ్రెస్ నాయకులు రమేష్, మొండయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు మర్రి దేవ రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మందెంట పోతుండే ఎలమందా..



మందెంట పోతుంటే ఎలమందా.. వాడు ఎవ్వాడి కొడుకే ఎలమందా..ఈ పాటను ఓ సినిమాలో చూశాం...ఈ ఫోటోను చూస్తుంటే కూడా ఆ సినిమా పాటనే గుర్తుకు వస్తుంది. అయితే గొర్లమంద మంచిగుంటేనే కాపరి సంతోషంగా ఉంటడు. ఏ ఒక్క జీవానికి సుస్తీ చేసినా తల్లడిల్లిపోతడు. గొర్లకు మేత లేకపోతే వస్తులున్నంత బాధపడతడు. అవి ఎండల అల్లాడిపోతే ఎలమంద కండ్లల్ల నీళ్లు తిరుగుతయ్. వాటికి ఏ కష్టం రావద్దని ఎలమందలు, మందలతో పాటు పల్లెలు, పట్నాలు దాటి అడవుల బాట పడుతున్నరు. మహబూబ్?నగర్?కు చెందిన ఓ ఎలమంద జయశంకర్? భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోణంపేట వద్ద ఇలా గొర్రెల వెంట వాటిని కంటికి రెప్పలా చూసుకుంటూ పోతుండగా నినాదం కెమెరా కంటపడగా క్లిక్ మనిపించింది.

- జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం న్యూస్)

# పోలింగ్ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల డిస్టిబ్యూషన్ కేంద్రాలను పరిశీలన
- ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ.హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి26 (నినాదం) :** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను సిబ్బంది కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష సూచించారు.బుధవారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన డిస్టిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష పరిశీలించారు. డిస్టిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని,పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన సామాగ్రి సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని,సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ,నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పట్టభద్రులు,టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి అందజేసే కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగిందని,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 36 పోలింగ్ కేంద్రాలు,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో దాదాపు 31 వేల పట్టభద్ర ఓటర్లు,1100 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని అన్నారు.సజావుగా పోలింగ్ జరిగేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసామని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని అన్నారు.ఎండలు దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలకు అవ సరమైన చల్లని నీరు,క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని అన్నారు.జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు




చేశామని తెలిపారు. గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఓటర్లందరూ తప్పనిసరిగా ఫిబ్రవరి 27న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఆలోచించి,స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డి.వేణు,రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య,సురేష్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి జిల్లా రవాణా అధికారి రంగారావు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## తానంచర్లలో అగ్రోస్ రైతు సేవ కేంద్రం ప్రారంభం

- రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలను అందజేయాలి
- డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్

**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 26(నినాదం న్యూస్) :** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు తేజావత్ భరత్ కుమార్ తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఆరుగాలం కష్టించి



పండించే రైతులకు నాణ్యమైన ఎరువులు,విత్తనాలను అందించాలన్నారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి,అభినవ్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి నాయక్,మరిపెడ మండల అధ్యక్షులు రఘువీర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు నల్లు శ్రీకాంత్ రెడ్డి,నరేష్ రెడ్డి,గంధసిరి అంబరీష,మెంచు అశోక్,తేజవత్ రవి నాయక్, మరిపెడ ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు కాలం శ్రీనివాస్ రెడ్డి, మూలమరితండ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు...

---

నినాదం సినిమా

### ప్రభాస్ ప్రశాంత్ వర్మ కాంబోలో

# పాన్ ఇండియా సినిమా

హనుమాన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రస్తుతం 'జై హనుమాన్' సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఇదే కాకుండా నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞతో ఒక సినిమా.. అలాగే ఇండియన్ ఫస్ట్ సూపర్ వుమెన్ ప్రాజెక్ట్ మహాకాళి అనే ప్రాజెక్టలను చేయబోతున్నాడు ప్రశాంత్ వర్మ. అయితే ఈ మూడు సినిమాలు కాకుండా తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి తాజాగా మరో సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ప్రశాంత్ వర్మ ఒక సినిమా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుండగా.. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్క్రిప్ట్ పనులు జరుగుతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ ప్రాజెక్ట్ కోసం త్వరలోనే ప్రభాస్ లుక్ టెస్ట్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఇక ఈ సినిమాను కన్నడ టాప్ బ్యానర్ హొంబలే ఫిలిమ్స్ నిర్మించబోతున్నట్లు టాక్. మైథలాజికల్ మూవీగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## విడాకులపై స్పందించిన పినిశెట్టి



తమిళ నటుడు ఆది పినిశెట్టి విడాకులు తీసుకోబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పెళ్ళైన మూడేండ్లకే తన భార్య నటి నిక్కీ గల్రానీతో విడిపోతున్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించాడు ఆది పినిశెట్టి. నటుడు ఆది పినిశెట్టి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఒక విచిత్రం, గుండెల్లో గోదారి సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్నాడు. సరైనోడు, నిన్ను కోరి, రంగస్థలం సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. ప్రస్తుతం శబ్దం. సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. వైశాలీ సినిమా దర్శకుడు అరివళగన్ ఈ సినిమా దర్శకత్వం వహిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు. అయితే రీసెంట్‌గా అతడిపై విడాకుల వార్తలపై ఆది స్పందించాడు. నిక్కీ గల్రానీతో నేను విడాకులు తీసుకుంటున్నట్లు వచ్చిన వార్తలు చూసి చాలా బాధపడ్డాను. పెళ్లి కాకముందు నిక్కీ నాకు మంచి స్నేహితురాలు. నా ఫ్యామిలీతో కూడా బాగా కలిసిపోయింది. ఇంట్లో వాళ్లకి కూడా నిక్కీ బాగా నచ్చడంతో తనతో ఉంటే సంతోషంగా ఉంటాను అనిపించింది. దీంతో ఇంట్లో చెప్పి పెద్దల అంగీకారంతో మేము పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం సంతోషంగా జీవిస్తున్నాం. అయితే మేమిద్దరం విడిపోతున్నామని పలు యూట్యూబ్ ఛానల్స్‌లో కథనాలు వచ్చాయి. అవి చూసి చాలా కోపం వచ్చింది. ఇలాంటి యూట్యూబ్ ఛానల్స్ వ్యూస్, క్లిక్స్ కోసం ఎంతకైనా తెగిస్తారని పట్టించుకోవడం మానేశాను అంటూ ఆది వెల్లడించాడు.



### ఉపాసన తల్లిదండ్రుల పెళ్లి వార్షికోత్సవంలో

## ఉపాసన, రామ్‌చరణ్ సందడి

టాలీవుడ్ స్టార్ నటుడు రామ్‌చరణ్ సతీమణి, మెగా కోడలు ఉపాసన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ.. ఫ్యామిలీకి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు పంచుకుంటూ ఉంటుంది. తాజాగా తన తల్లిదండ్రుల వివాహ వార్షికోత్సవ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన క్యూట్ వీడియో ఇన్‌స్టా వేదికగా ఉప్సీ షేర్ చేసింది. ఉపాసన తల్లిదండ్రులు శోభన, అనిల్ కామినేని వివాహ వార్షికోత్సవ వేడుకలను కుటుంబ సభ్యులు గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు. దుబాయ్ బీచ్‌లో కుటుంబం అంతా కలిసి సందడి చేశారు. ఈ వేడుకల్లో ఉపాసన, రామ్ చరణ్‌తోపాటు వారి ముద్దుల కుమార్తె క్లీంకార ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇందుకు సంబంధించిన క్యూట్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు ఉప్సీ తల్లిదండ్రులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక క్లీంకార పుట్టి ఈ జూన్ 20వ తేదీకి రెండేళ్లు పూర్తి కానున్న విషయం తెలిసిందే.

### ఆయన పక్కన లేకపోతే

# కష్టంగా ఉంది : రకుల్



అతి తక్కువ సమయంలో టాలీవుడ్ అగ్ర కథానాయికగా ఎదిగారు రకుల్ ప్రీత్ సింగ్, స్టార్ హీరోలు అందరితోనూ ఆమె యాక్ట్ చేసింది. జాకీ భగ్నానీతో పెళ్లి తర్వాత పూర్తిగా ముంబై మకాం మార్చేసింది. గతేడాది ఫిబ్రవరి 21న జాకీతో ఆమె పెళ్లి జరిగింది. ప్రేమ వివాహంతో ఒకటైన ఈ జంట ఇటీవలే తమ మొదటి వివాహ వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకున్నారు. అయితే షూటింగ్ సమయంలో తన భర్తను చాలా మిస్ అవుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. సినిమా షూటింగ్ సమయంలో మా ఆయనను బాగా మిస్ అవుతున్నట్టు అనిపిస్తుంటుంది. అయన పక్కన లేకపోతే చాలా కష్టంగా ఉంది. ఆ సమయంలో అతనికి దూరంగా ఉన్నాను అనే ఫీల్‌ను పోగొట్టుకోవడానికి ఆయన స్వెట్ షర్ట్‌ను ధరిస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చింది. ఓ సెల్ఫీ ఫొటోను పంచుకుంది రకుల్. అందులో ఆమె 'జేబీ' అనే పేరుతో భర్త పేరును సూచించే హుడి ధరించి ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. ఇటీవల మేరే హస్బెండ్ కే బీవీ' సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకుల ముందుకొచ్చింది రకుల్. తదుపరి ఆమె చేతిలో ఇండియన్ 3, దేదే ప్యార్ దే 2 చిత్రాలున్నాయి. తెలుగులో అయితే ఆమె సైన్ చేసిన సినిమా ఒకటీ లేదు.

## మన్నత్‌ను వీడబోతున్న షారుఖ్‌ఖాన్

**- రూ.24 లక్షలు చెల్లించి అద్దె ఇంటిలోకి...**



బాలీవుడ్ బాద్‌షా, నటుడు షారుఖ్ ఖాన్ తన ఇంటి (మన్నత్)ని వీడబోతున్నట్లు తెలుస్తుంది. తాజాగా ఇందుకు సంబంధించిన వార్తలు వైరల్‌గా మారాయి. షారుఖ్ ఇల్లు మన్నత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ముంబైలో ఉన్న మోస్ట్ టూరిస్ట్ ప్లేస్‌లలో ఇది కూడా ఒకటి. షారుఖ్‌ని చూద్దామని వచ్చి అతడు కలవకపోయిన అతడి ఇంటిముందు ఫొటో దిగి వెళతారు అభిమానులు. ఇక షారుఖ్ కూడా తన బర్త్‌డే జరుపుకున్న ప్రతిసారి ఈ ఇంటి బాల్కనీ మీదకి వచ్చి అభిమానులకు ధన్యవాదాలు చెబుతాడు. అయితే తాజా సమాచారం ప్రకారం షారుఖ్ మన్నత్‌ని వీడబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఈ భవనం లోపల రెనోవేషన్ పనులు జరుగబోతున్నట్లు సమాచారం. అందుకే షారుక్ మన్నత్‌ని వదిలి అద్దె అపార్ట్‌మెంట్‌లోకి వెళుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ముంబయిలోని పాలి హిల్ ప్రదేశంలో ఉన్న 'పూజా కాసా' అనే భవనంలో రెండు డూప్లెక్స్ అపార్ట్‌మెంట్‌లను షారుఖ్ అద్దెకి తీసుకున్నారని వార్తలు బయటకు వచ్చాయి. ఇక ఈ రెండు ఆపార్ట్‌మెంట్‌లకు కలిపి ఏడాదికి దాదాపు రూ. 2.9 కోట్లు షారుఖ్ అద్దె చెల్లించనున్నట్లు సమాచారం. మరోవైపు షారుఖ్ కంపెనీ రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పటికే నెలకు రూ. 24 లక్షలు అద్దె చెల్లించినట్లు రిపోర్ట్స్ బయటకు వచ్చాయి.

# యాక్టింగే తన ఫస్ట్ లవ్ : సమంత



తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో స్టార్ నటి సమంత ఒకరు. అయితే, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు లాంగ్ బ్రేక్ ఇచ్చింది. ఇంతలోనే తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించడం.. తన మాజీ భర్త రెండో పెళ్లి చేసుకోవడం సామ్‌ను తీవ్రంగా బాధించాయి. వీటన్నింటి నుంచి తేరుకుని ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారింది. వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్ : హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో మెరిసిన సమంత.. ప్రస్తుతం రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న వెబ్ సిరీస్ 'రక్త్ బ్రహ్మాండ్' షూట్‌లో జాయిన్ అయింది. ఈ నేపథ్యంలో కొంతకాలం విరామం తర్వాత మళ్లీ సినిమాల్లోకి రావడం పట్ల సమంత స్పందించారు. ఇకపై విరామం తీసుకోనని ప్రకటించారు. యాక్టింగ్ తన ఫస్ట్ లవ్ అని పేర్కొన్నారు. 'సినిమాలు నా మొదటి ప్రేమ. నేను ఇకపై నటనకు విరామం తీసుకోను. ఇప్పటికే చాలా గ్యాప్ ఇచ్చాను. తిరిగి మీ సామ్ మీ ముందుకు వరుస చిత్రాలతో వస్తుంది' అని ప్రకటించింది. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్' పూర్తి చేసే పనిలో ఉన్నట్లు తెలిపింది. ఆ తర్వాత మరో చిత్రం కూడా రెండు నెలల్లో సెట్స్ మీదకు వెళ్తుందని పేర్కొంది. కాగా, విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. ప్రస్తుతం తన కొత్త వెబ్ సిరీస్ వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741